



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 11.06.2026 | సంపుటి :12 సంచిక : 322 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## 25 నుంచి 'సర్'

- ఐటీని విరివిగా ఉపయోగించుకోవాలి
- తెలంగాణలో పక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులకు ఎస్ఈసీ సుదర్శన్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర

మిగతా 2లో..



## నైరుతి విస్తరణ ఆలస్యం

తెలంగాణలోకి ప్రవేశించినా జోగులాంబ గద్వాల జిల్లాలోనే కేంద్రీకృతమైన రుతుపవనాలు

2లో..

# భవిష్యత్తు కోసం నేడు పునాదులు

## టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ ప్రపంచానికి దిక్సూచిగా మహానగరం నిర్మాణం

- విచ్చలవిడిగా నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగిపోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు రాసిచ్చిన కేసీఆర్
- బంగారం ధర కంటే రంగారెడ్డిలో భూముల ధరలే ఎక్కువగా ఉన్నాయి
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

దీన్ని రద్దుచేస్తామంటే గల్లంతవుతారు

అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్‌ల పని

కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు

"నిన్న వర్షానికి రోడ్లు మొత్తం వరద నీటితో నిండిపోయాయి. రోడ్లపై వరద పారుతుంటే.. దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? చెరువుల్లోకి వెళ్లాల్సిన నీరు కబ్జాల వల్ల రోడ్లపైకి వస్తోంది. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమి సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్‌సిటీలోగ్లోబల్ సమిట్‌ను నిర్వహిస్తాం. ప్రజలు విజ్ఞప్తితో కొన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలుపుతున్నాం. అడ్డువచ్చిన వారిని ఈ ప్రాంత ప్రజలే తొక్కుకుంటూ పోతారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్‌సిటీ వర్ధిల్లుతుంది" - సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని

మిగతా 2లో..

## సీఎం ప్రసంగంపై తప్పుడు వీడియో పోస్టు

కారకులపై కేసు నమోదు

2లో..

## కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం దిశగా

# దీదీ అడుగులు



## రాహుల్‌తో రహస్య చర్చలు

మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవి?



బీజేపీని ఢీకొట్టేందుకు ప్రతిపక్షాల మధ్య ఐక్యత అవసరమన్న రాహుల్

ఇండియా కూటమి సమావేశం అనంతరం వేగంగా సమీకరణాలు

న్యూఢిల్లీ, జూన్ 10 (జనంసాక్షి)

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీలో అంతర్గత విభేదాలు, తిరుగుబాట్లు తీవ్రరూపం దాల్చాయి. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఒకప్పుడు మమతా బెనర్జీకి అత్యంత ఆప్తులుగా ఉన్నవారు

మిగతా 2లో..

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయనే వార్తలు దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టీఎంసీ భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఢిల్లీలో మకాం వేసి, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో వరుసగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ లోక్ సభ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఇరు పార్టీల విలీనానికి బహిరంగంగా పిలుపునిచ్చిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.



## ప్రముఖ దర్శకుడు భారతీరాజా కన్నుమూత

- గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- పలువురు ప్రముఖుల సంతాపం

చెన్నై(జనంసాక్షి): చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ తమిళ దర్శకుడు భారతీరాజా (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన నేడు చెన్నైలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలను

మిగతా 2లో..

## తెలంగాణలో నక్సలిజం పూర్తిగా

# అంతమైంది

- సాధారణ ప్రజలకే ఫ్రెండ్లీ పోలీసింగ్
- రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం
- గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల
- సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం
- రాష్ట్ర డీజీపీ సీవి ఆనంద్ స్పష్టీకరణ



ఆదిలాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు.

మిగతా 2లో..

# 2027 వేసవి నాటికి అందుబాటులోకి మేడిగడ్డ

## జూలై తొలి వారానికల్లా ప్రాజెక్టుకు సంబంధించి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి

- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ ప్రారంభం
- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ
- ప్రధాన లక్ష్యం
- మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి): మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్

మిగతా 2లో..



## మూణ్ణాళ్ల ముచ్చటగా బీఆర్ఎస్ ప్రాజెక్టులు

- కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయింది
- కాంగ్రెస్ హయంలో అన్ని ప్రాజెక్టులు శాశ్వతంగా నిలిచిపోయాయి
- నిజామాబాద్ పర్యటనలో జాకోరా, చందూర్ ఎత్తిపోతలను
- ప్రారంభించిన మంత్రి ఉత్తమ్
- సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు కేటాయింపు

12లో..

# దేశ ప్రజల్లో విశ్వాసం నిలుపుకున్నాం

- అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చాం: ప్రధాని మోదీ
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ రికార్డు ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి
- అభినందనలు తెలిపిన రాష్ట్రపతి వివిధ దేశాల నేతలు



హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న

మిగతా 2లో..



## ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం

- ఆధునిక భారతం ఆవిష్కరించిన నెహ్రూ
- 12 ఏళ్ల సుదీర్ఘ పాలనపై జైరామ్ రమేశ్ ఎద్దేవా

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఎన్నికైన ప్రధానుల్లో నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ రికార్డు సృష్టించారు. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ

మిగతా 2లో..

# మళ్లీ రాజుకుంటున్న అగ్గి

## రణరంగంగా పశ్చిమాసియా • అమెరికా- ఇరాన్ మధ్య భీకర దాడులు

- ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం
- సైనిక పరంగా చాలా దెబ్బతిన్నది
- ఒప్పందానికి ఇంకా జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదు: ట్రంప్
- క్షేమంగా ఉండాలంటే.. వెంటనే ఇరాన్ విడిచివెళ్లండి
- అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హర్మూజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది.అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జీసీ అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తో పాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లలో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యూఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడులను

మిగతా 2లో..

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్

# బాంబుల వర్షం

### నిద్రలోనే 11 మంది చిన్నారుల మృతి

కాబూల్(జనంసాక్షి):అఫ్ఘానిస్థాన్- పాకిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్ధరాత్రి వేళ.. అఫ్గాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. సెర్పా జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో

మిగతా 9లో..



## దేశ ప్రజల్లో విశ్వాసం నిలుపుకున్నాం

ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. "కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారు" అని పేర్కొన్నారు.

**అత్యధిక కాలం ప్రధానిగా మోదీ రికార్డు**

నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.

మోదీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

ప్రపంచ దేశాల నేతల అభినందనలు

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు. 'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం' అని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేం దుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అంటూ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం అభినందనలు తెలిపారు.

## ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం

మోదీపై విమర్శలు గుప్పించింది. ఆయన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి పెద్ద సమస్యగా పరిణమించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ పాలనకు కాకుండా దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని అన్నారు. 1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి.. భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గం పాలనలో ఐదేళ్లలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందన్నారు. 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేశారని.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని అన్నారు. దేశంలోని జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, నీటిపారుదల ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో దేశం ప్రపంచ వ్యవహారాల్లో ఒక శక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1947–52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన రికార్డులను మోదీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ భారీ మెజారిటీతో విజయం సాధించగా.. 2024లో మోదీకి కనీస మెజారిటీ కూడా రాలేదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని కావడానికి ఎన్డీఏ నేతలకు తాయిళాలు ఇచ్చి మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందన్నారు.

# భవిష్యత్తు కోసం నేడు పునాదులు

కుట్రలు చేస్తున్నారని ఆగ్ర హించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేం దుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచా ర్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సె టైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అ భివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం



నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

## సీఎం ప్రసంగంపై తప్పుడు వీడియో పోస్టు..

### కారకులపై కేసు నమోదు

హైదరాబాద్(జనంసాక్షి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాన్ని డిజిటల్‌గా మార్పులు చేయడమేకాక ఆయన ప్రసంగించినట్లు అసత్య వ్యాఖ్యలతో కూడిన వీడియో సృష్టించి పోస్టు చేసిన వ్యక్తులపై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైం అధికారుల కథనం ప్రకారం.. సైబర్ క్రైం ఎస్సై పి.జయప్రకాశ్ ఈ నెల 6న విధి నిర్వహణలో భాగంగా ఓ ఇన్‌స్టాగ్రాం లింక్‌లో రీల్స్ పరిశీలిస్తుండగా అందులో ముఖ్యమంత్రి చిత్రాన్ని మార్ఫింగ్ చేసి పోస్టు చేసినట్లు గుర్తించారు. ఆయన మాట్లాడుతున్నట్లు ప్రసంగం వీడియోను సృష్టించి ఉంచారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వీడియోను రూపొందించినట్లు తెలుసుకున్నారు. ఆ వ్యాఖ్యలు అనర్థాలకు దారి తీసేలా ఉన్నాయి. తద్వారా శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉండటంతో ఆ పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది.

## నైరుతి విస్తరణ ఆలస్యం

హైదరాబాద్(జనంసాక్షి): నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించినా జోగులాంబ గద్వాల జిల్లాలోనే కేంద్రీకృతమయ్యాయి. ఈ రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేవని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మూడు, నాలుగు రోజుల్లో విస్తరించే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రస్తుతం వీటి ప్రభావంతో బుధవారం నల్గొండ, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు.

## 2027 వేసవి నాటికి అందుబాటులోకి మేడిగడ్డ

తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016–17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ–డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు.

గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ పక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ÷ఎనరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్‌స్టలెంట్ సంస్థ , ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని ఆయన తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ పక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన స్కౌర్ డెప్త్, కట్–ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో మెడిగడ్డతో పాటు అన్ని బ్యారేజీలను పునరుద్ధరిస్తాం. తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టులను తిరిగి సురక్షితంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకువస్తాం‘ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## 25 నుంచి 'సర్'

సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ అధికారి ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ పక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడు తుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందిం చడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిస.।ఇ‌తి.ణనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ పక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ పక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

## కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం దిశగా

# దీదీ అడుగులు

సైతం ఇప్పుడు తృణమూల్‌కు గుడ్‌బై చెబుతున్నారు. ఎన్నికల అనంతర పరిస్థితులు, బీజేపీ నుంచి పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు, నాయకులపై దాడులు, అంతర్గత తిరుగుబాట్లు వెరసి మమతా బెనర్జీకి పెద్ద తలనొప్పిగా మారాయి. ఈ తీవ్రమైన సంక్షోభం నుంచి పార్టీని గట్టెక్కించే మార్గాలపై చర్చించేందుకే ఆమె ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అధిష్టానంతో సంప్రదింపులు జరు పుతున్నారు. ఈ భేటీల సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ.. మమతా బెనర్జీ ముం దు ఒక కీలకమైన ప్రతిపాదనను ఉంచినట్లు తెలు స్తోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభావాన్ని సమర్థ వంతంగా ఎదుర్కొని, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను బలోపేతం చేయాలంటే టీఎంసీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడమే సరైన మార్గమని సోనియా సూచిం చారు. అయితే, ఈ ప్రతిపాదనపై మమతా బెనర్జీ తక్షణమే ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీని విలీనం చేస్తే భవిష్యత్తులో నాయకత్వ బాధ్యతలు ఎలా ఉంటాయనే దానిపై కొన్ని సందేహాలు వ్యక్తం చేసిన మమత, ఆలోచించుకోవడానికి కాంగ్రెస్ అధిష్టానాన్ని కొంత సమయం కోరినట్లు విశ్వసనీయ సమాచారం.

**కీలక బాధ్యతలు అప్పగించేందుకు అంగీకారం**

ఈ విలీన ప్రక్రియను సుగమం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఒక ఆకర్షణీయమైన కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీని ప్రకారం, విలీనానికి అంగీకరిస్తే మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని ఇవ్వడానికి సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అలాగే, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలకమైన బాధ్యతలు అప్పగించేందుకు అంగీకారం కుదిరింది. ఇదే తరుణంలో అభిషేక్ బెనర్జీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో గంటన్నరకు పైగా ఏకాంతంగా జరిపిన చర్చలు సైతం చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగినట్లు వారి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

**భారత రాజకీయాల్లో ఆసక్తికరంగా..**

టీఎంసీలో అంతర్గత సంక్షోభం రోజురోజుకూ ముదురుతోందనడానికి స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. బుధవారమే టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు సుష్మితా దేవ్ "రెండు పడవలపై ప్రయాణం చేయలేను" అంటూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతకుముందే మరో ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ కూడా పార్టీ పాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ తప్పుకున్నారు. దీనికి తోడు, సుమారు 20 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీలు పార్లమెంట్‌లో తమకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరడం కలకలం రేపుతోంది. బెంగాల్ అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తిరుగుబాటు వర్గ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ ప్రకటించడం పార్టీలో తిరుగుబాటును స్పష్టం చేస్తోంది. అయితే, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కాబోతోందంటూ జాతీయ మీడియాలో వస్తున్న కథనాలను తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు ప్రస్తుతానికి తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ భేటీలు కేవలం 'ఇండియా' కూటమిని బలోపేతం చేయడానికి, 2029 లోక్‌సభ ఎన్నికల కోసం ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడానికి మాత్రమేనని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రతిపక్షాల మధ్య సమన్వయాన్ని సంస్థాగత విలీనంగా భావించకూడదని టీఎంసీ నేతలు చెబుతున్నప్పటికీ.. మారుతున్న రాజకీయ సమీకరణాలు, అంతర్గత సంక్షోభాల నేపథ్యంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్–టీఎంసీల బంధం ఏ మలుపు తిరుగుతుందనేది ఇప్పుడు భారత రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

**టీఎంసీ, కాంగ్రెస్‌లకు ఉమ్మడి చరిత్ర**

టీఎంసీ, కాంగ్రెస్‌లకు ఉమ్మడి చరిత్ర ఉంది. మమతా బెనర్జీ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. 2011లో పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కాంగ్రెస్, టీఎంసీ కలిసి పనిచేశాయి, కానీ మరుసటి ఏడాదే వారి పొత్తు విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇండియా కూటమిలో భాగస్వాములయ్యారు. సోనియా గాంధీతో మమతా బెనర్జీ సమావేశమైన తర్వాత ఈ పార్టీల మధ్య సంబంధాలు మరింత బలపడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి.

## తెలంగాణలో నక్సలిజం పూర్తిగా అంతమైపోయింది

వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

## మళ్లీ రాజుకుంటున్న అగ్గి

ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడు తూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పం దన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించా రు. వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు. దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. యూఎస్ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. దాడులు, బెదిరింపులకు తమ సాయుధ దళాలు కచ్చితంగా స్పందిస్తాయన్నారు. క్షేమంగా ఉండాలనుకుంటే.. వెంటనే ఈ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ బలగాలను హెచ్చరించారు.

### ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌ను తాము పూర్తిగా ఓడించామని.. సైనిక పరంగా ఆ దేశం సర్వనాశనం అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైందన్నారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి సమయం మించిపోతున్నా అక్కడి నేతలు ఇంకా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ఇరాన్ నేతలవి మాటలే కానీ చేతలు ఏమీ ఉండవని ట్రంప్ ఎద్దేవా చేశారు. వారికి మేలు చేయడానికి తాము త్వరగా యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుం టుంటే ఇరాన్ నేతలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒప్పందం విషయంలో ఆలస్యం చేస్తున్నందుకు టెహ్రాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై తమ సైన్యం కొత్త దాడులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఆ దేశం మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదిలావుండగా టెహ్రాన్–వాషింగ్టన్‌ల మధ్య ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రయత్నంలో భాగంగా ఖతార్ ప్రతినిధులు ఇరాన్‌కు వెళ్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## ప్రముఖ దర్శకుడు భారతీరాజా కన్నుమూత

ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు.1941 జులై 17న జన్మించిన భారతీరాజా 1977లో వచ్చిన తమిళ మూవీ '16 వయథినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు) తో దర్శకుడిగా మారారు. 'కొత్త జీవితాలు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తెలుగులోనూ పలు క్లాసిక్ సినిమాలను తెరకెక్కించి లెజెండరీ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన సీతాకోకచిలుక, ఆరాధన, జమదగ్ని సినిమాలు ఇండస్ట్రీలో బ్లాక్ బస్టర్‌లుగా నిలిచాయి. ఆరు జాతీయ అవార్డులు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 'సీతాకోకచిలుక'కు నేషనల్ అవార్డుతో పాటు, ఉత్తమ దర్శకుడిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. 'మంగమ్మగారి మనవడు'కు కథను, 'పల్నాటి పౌరుషం' చిత్రానికి స్క్రీన్‌ప్లేను అందించారు. ఇటీవల మోహన్‌లాల్ నటించిన 'తుడురమ్' సినిమాలో భారతీరాజా చివరిసారిగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2004లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది.

**భారతీరాజా భౌతిక కాయం వద్ద సిఎం విజయ్ నివాళి**

దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజాకు సిఎం విజయ్ నివాళి అర్పించారు. భారతీరాజా నివాసానికి వెళ్లిన సిఎం ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమిళ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేశారు. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు, తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపకుడు, దిగ్గజ దర్శకుడైన భారతీరాజా తుది వీడ్కోలుకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అభ్యర్థనకు స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడిం చారు. ఈ సందర్భంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రభావవంతమైన, విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి భారతీరాజా అని కొనియాడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులను మరియు మరెన్నో ప్రశంసలను ఆయన అందుకున్నారని గుర్తుచేసింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన సహకారం అసమానమైనదని, ఒక దర్శకుడిగా ఎన్నో కాలాతీత క్లాసిక్ చిత్రాలను సృష్టించడమే కాకుండా, నటుడిగానూ తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది.

**నివాళి అర్పించిన మెగాస్టార్ చిరంజీవి**

విలక్షణ కథాంశాలతో యావత్ దేశాన్ని మెప్పించిన ఈ 'దర్శక శిఖరం' భారతీరాజా మరణవార్తతో అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించేందుకు సినీ ప్రముఖులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ విషాద సమయంలో మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ అత్యంత ఎమోషనల్ అయ్యారు. భారతీయ చలనచిత్ర రంగం ఇవాళ ఒక అసాధారణ కథకుడిని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి మట్టి పరిమళాలను, అచ్చమైన మానవ సంబంధాల సున్నితత్వాన్ని, అమాయక త్వంతో కూడిన ప్రేమను, సామాన్యుల జీవితాల్లోని భావోద్వేగాలను వెండితెరపై అద్భుతమైన కావ్యాలుగా మలిచిన ఘనత భారతీరాజా గారికే దక్కుతుందని చిరంజీవి కొనియాడారు.

## మేడారం అభివృద్ధి పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- భక్తులకు శాశ్వత సౌకర్యాలను కల్పించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



ఎస్ ఎస్ తాడ్వాయి, జూన్ 10(,జనంసాక్షి) : మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తి భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మేడారం మహాజాతర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని, జాతర సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జంపన్నవాగు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకల మార్గాలను నిరంతరం పరిశీలిస్తూ, ఆలయ ప్రాంగణంలో భద్రత, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, వనదేవతల ఆలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి గారూ.. బేల మాటలు వద్దు

- మహారాష్ట్ర సీఎంతో భేటీకి చేసిన ప్రయత్నాలపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి
- ఏపీ జలదోపిడీకి రేవంత్ వంత పాడుతున్నరు
- టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నవీన్ కుమార్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమాల ఖిల్లా అన్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కామెర నవీన్ కుమార్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ నాయకులు ఎదురుగట్ల సంపత్ గౌడ్, దండెం ఆనందం, ఎత్తరి మారయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని సీఎం రేవంత్ బేల మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పోరాటాల పురిటిగడ్డ తెలంగాణకు ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇలాంటి మాటలు మాట్లాడటం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటి వరకు చేసిన ప్రయత్నాలేమిటో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే తుమ్మిడిహెట్టి నిర్మిస్తామని ఇచ్చిన హామీని రెండున్నరేళ్లు పట్టించుకోలేదన్నారు. ఇంజనీర్లు, సెక్రటరీల స్థాయిలో ఈ బ్యారేజీ నిర్మాణం గురించి చర్చలు కూడా జరగలేదన్నారు. రాజకీయం కోసమే తుమ్మిడిహెట్టి బ్యారేజీ జపం చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రాణహిత – చేవెళ్లను రీ డిజైన్ చేసి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు నష్టం చేస్తే తుమ్మిడిహెట్టి నిర్మిస్తామని హామీ ఇచ్చి దానిని నిలబెట్టుకోకుండా రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు

- తెలంగాణలో ఇక బిజెపిదే తదుపరి అధికారం
- బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్

భువనగిరి, జూన్ 10 (జనంసాక్షి) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.

## నేడు, రేపు వైజ్ఞానిక శిక్షణా తరగతులు

- 13న జరుగు రాష్ట్ర సెమినార్
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూన్ 11,12 తేదీల్లో జరుగు తెలంగాణ రైతు సంఘం వైజ్ఞానిక శిక్షణా తరగతులను, జూన్ 13న జరుగు రాష్ట్ర సెమినార్ ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ పిలుపు ఇచ్చారు. ఈరోజు (జూన్ 10న) తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో(ఆర్ టి సి క్రాస్ రోడ్లోని) రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ రావు, కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు శివకుమార్ లతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరుగు వైజ్ఞానిక శిక్షణా తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా నుండి ఎంపిక చేయబడిన ప్రతినిధులు హాజరవుతారని ఈ సందర్భంగా వ్యవసాయ రంగం అనుబంధ రంగాలలో నిష్ణాతులైన వారిచే శిక్షణా కార్యక్రమం ఉంటుందని అన్నారు. 13వ తేదీన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మధురా స్వామినాథన్ భారత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలుడ జీవనోపాదుల పై ప్రభావం అనే అంశంపై ప్రసంగిస్తారు. వానాకాలం సాగు– పంటలు, అవకాశాలపై జరుగు సెమినార్ లో భారత నూనగింజల పరిశోధనా సంస్థ పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ వీరేపల్లి రంగారావు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ లతీఫ్ పాషా, భారత నూనగింజల పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రజ్ఞులు డాక్టర్ జి సురేష్, రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్శిటీ సీనియర్ శాస్త్రజ్ఞులు డాక్టర్ వి మురళి, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ కె విజయ్ కుమార్, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఐకెయస్ జాతీయ కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి లు ప్రసంగిస్తారని తెలిపారు. రైతులు, రైతు అభిమానులు ఈ సెమినార్లు లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి

- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్
- తోషం గ్రామసభలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ





గుడిహత్నూర్ (జనంసాక్షి) : గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో డీజీపీ సీవీ ఆనంద్ పాల్గొన్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుస్సాడి కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అతిథులను ఆహ్వానిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువత గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద సమయంలో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల సమయంలో రక్తస్రావాన్ని నియంత్రించి ప్రాణాలను కాపాడడంలో ఈ కిట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అదేవిధంగా తోషం, తోషం తాండా, రాగాపూర్, బోర్రమద్ది, పూనగూడ, తోయిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసీ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఐదు వాలీబాల్ కిట్లను అందజేశారు. గ్రామసభలో పాల్గొన్న సుమారు 200 మంది ప్రజలకు హెల్మెట్లను పంపిణీ చేసి, హెల్మెట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అలాగే కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. రోడ్డు భద్రతపై కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించడంలో మహిళల పాత్ర కీలకమని, వాహనాలు నడిపే వారు హెల్మెట్లు ధరించేలా ప్రోత్సహించాలని సూచించారు. యువతలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే సదుద్దేశంతో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. ప్రతి వాహనదారుడు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే గతంలో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్–1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మౌనిక ఐపీఎస్, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నిర్మల్ పోలీసుల 'పోలీస్ అక్క' కార్యక్రమానికి డీజీపీ ప్రశంసలు

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల జిల్లాలోని నేరాల పరిస్థితి, పోలీసు పనితీరు, అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. 2025–26 సంవత్సరంలో నమోదైన గుర్తించదగిన నేరాల వివరాలను సమీక్షిస్తూ, గత ఏడాదితో పోల్చితే నేరాల సంఖ్యలో సుమారు 4.7 శాతం తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. 2025 సంవత్సరంలో 1,155 కేసులు నమోదు కాగా, 2026 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 896 కేసులు నమోదయ్యాయని వివరించారు. బైసా ప్రాంతంలో మత ఘర్షణలు పూర్తిగా తగ్గినట్లుగా ఎస్పీ వెల్లడించారు.

మహిళలపై జరిగే నేరాల విషయంలో కూడా స్వల్ప తగ్గుదల నమోదైందని, గత ఏడాదితో పోల్చితే సుమారు 2.2 శాతం మేర తగ్గినట్లు తెలిపారు. అయితే పోక్సో చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నదని, 32 కేసులు నమోదై సుమారు 10 శాతం పెరిగినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదవుతున్న డ్రగ్స్ కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వినూత్నమైన “పోలీస్ అక్క” కార్యక్రమాన్ని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రధానిగా నెహ్రూ 17 ఏండ్ల రికార్డ్ పాలన

- దాదాపు ఎడాది పాటు ప్రధాని హోదా కలిగిన వైస్ ప్రెసిడెంట్ అఫ్ బ్రిటిష్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ బాధ్యతలు
- నెహ్రూ కన్నా మోడీ ఎక్కువ రోజులు పాలించినట్లు బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు
- ఇది చరిత్రను కాలరాసినట్లే
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : 1946 సెప్టెంబర్ 2 నుంచి 1947 ఆగస్టు 16 వరకు 346 రోజులు ప్రధాని హోదా కలిగిన వైస్ ప్రెసిడెంట్ అఫ్ బ్రిటిష్ వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, 1947 నుంచి 1952 వరకు వైస్ ప్రెసిడెంట్ నుంచి ప్రధాని హోదాతో, 1952 సాధారణ ఎన్నికల్లో గెలిచి 1964 వరకు ప్రధాన మంత్రిగా జవహర్ లాల్ నెహ్రూ 17 సంవత్సరాల పాటు, స్వాతంత్రానికి ముందు దాదాపు 346 రోజులు వైస్ ప్రెసిడెంట్ గా అఖండ భారతదేశాన్ని ( అన్ డివైడెడ్ ) పాలించారని, ఇది ఒక రికార్డ్ అని, ఈ వాస్తవ చరిత్రను బిజెపి నాయకులు వక్రీకరిస్తున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రధానిగా నరేంద్ర మోడీ 12 సంవత్సరాల నుంచి నెహ్రూ కన్నా ఎక్కువ రోజులు దేశాన్ని పాలిస్తున్నారని బిజెపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, బీజేపీ నాయకుల మాటలు శుద్ధ అబద్ధమని చిన్నారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నాయకులు దేశ చరిత్రను చదువుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని చిన్నారెడ్డి హితవు చెప్పారు. 1946 మార్చి 24న బ్రిటీష్ క్యాబినెట్ మిషన్ వైస్రాయ్ వావెల్ నాయకత్వంలో బృందం సభ్యులు పితిక్ లారెన్స్, క్రిప్స్, ఏ.వీ. అలెగ్జాండర్ వెస్ట్ పాకిస్తాన్, ఈస్ట్ పాకిస్తాన్ (బంగ్లాదేశ్) తో కూడిన అఖండ భారత దేశానికి వచ్చి త్వరలోనే భారతదేశానికి స్వాతంత్రాన్ని కల్పించనున్నట్లు ప్రకటించి నెహ్రూను ప్రధాన మంత్రి హోదాతో కూడిన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ గా నియమించగా ఆ హోదాలో నెహ్రూ 1947 ఆగస్టు 16 వరకు 346 రోజులు కొనసాగారని చిన్నారెడ్డి తెలిపారు. భారత దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ 1952 వరకు వైస్ ప్రెసిడెంట్ నుంచి ప్రధాన మంత్రి హోదాతో నెహ్రూ కొనసాగారని, 1952 మే 13 న జరిగిన దేశ మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించగా భారత దేశ ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టి 1964 మే 27 న చనిపోయే వరకు 12 ఏళ్ళు ప్రధానిగా కొనసాగారని చిన్నారెడ్డి వివరించారు. దేశ స్వాతంత్రానికి ముందు 1946 నుంచి దేశ స్వాతంత్రం వచ్చిన 1964 వరకు నెహ్రూ 18 ఏళ్ళ పాటు ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని, ఈరోజు రికార్డ్ ను ప్రస్తుత ప్రధాని మోడీ ఎప్పటికీ చేరుకోలేరని చిన్నారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నాయకులు అబద్దాలతో కాలం గడుపుతున్నారని, నెహ్రూ ప్రధాని కాలం చరిత్రను వక్రీకరిస్తున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. దేశానికి స్వాతంత్రం కోసం కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీలు పోరాటాలు చేసి జైలుకు వెళ్ళారని, ఆస్తులు దానం చేశారని, స్వాతంత్ర పోరాటంలో బీజేపీ నాయకుల పాత్ర అసలు లేనే లేదని చిన్నారెడ్డి అన్నారు.

## నమ్మకంపైనే రియల్ ఎస్టేట్ వృద్ధి

హైడ్రా కమిషనర్ రంగనాథ్




హైదరాబాద్ (జనంసాక్షి) : రియల్ ఎస్టేట్ వ్యాపారం నమ్మకంపై ఆధారపడి అభివృద్ధి చెందుతుందని, ఈ రంగంలో క్రెడిబిలిటీ (విశ్వసనీయత), మంచి రెప్యుటేషన్ చాలా ముఖ్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. తెలంగాణ రియల్టర్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన రియల్టర్స్ సమ్మిట్ – 2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కేవలం ఒక ప్రాపర్టీని విక్రయించి, కమిషన్ లేదా వ్యాపార లాభాలు పొందడం మాత్రమే లక్ష్యంగా ఉండకూడదని అన్నారు. వినియోగదారుడికి మంచి, సురక్షితమైన ప్రాపర్టీని అందిస్తున్నామా లేదా అనే బాధ్యత ప్రతి రియల్టర్‌పై ఉందని పేర్కొన్నారు. ‘మీరు మీ కోసం ఒక ప్లాట్ లేదా ఫ్లాట్ కొనుగోలు చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో.. అదే స్థాయిలో వినియోగదారుడికి ప్రాపర్టీ అందించేటప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. సొంత బిడ్డకు వివాహం చేసేటప్పుడు ఎంత శ్రద్ధ వహిస్తామో, స్థిరాస్తి కొనుగోలు సమయంలో కూడా అంతే జాగ్రత్తగా పరిశీలించాలి’అని హైడ్రా కమిషనర్ కొనుగోలుదారులకు సూచించారు. రియల్ ఎస్టేట్ రంగంలోనే కాదు.. మార్కెట్లో నిలబడాలంటే.. పారదర్శకత, నాణ్యత, బాధ్యతాయుతమైన విధానాలు అవసరమన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కాస్త మందగించడానికి హైడ్రా కారణం కాదని స్పష్టం చేశారు. దేశ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాలు, జీతాలు ఇలా అనేక అంశాలు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. దేశంలోని ఇతర పట్టణాల్లో కూడా రియల్ ఎస్టేట్ రంగం కాస్త మందగించిందనే విషయాన్ని గుర్తించాలని కోరారు. హైదరాబాద్‌ను మెరుగైన, పర్యావరణ హితమైన నగరంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రంగనాథ్ అన్నారు. ఇలాంటి ఆలోచనల నుంచే హైడ్రా అనే సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారాలను అవసరం మేరకు కట్టబెట్టి.. హైడ్రా ద్వారా ఒక మార్పు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మార్పు తీసుకురావాలంటే కొన్ని ప్రాథమిక ఇబ్బందులు ఎదురవుతాయని, అయితే సమాజ ప్రయోజనం కోసం ఆ మార్పు అవసరమని అన్నారు. ఇటీవల ఒడిశాలో జరిగిన బ్రిక్స్ సమావేశంలో వివిధ దేశాలతో పాటు.. ముఖ్యమైన నగరాల ప్రతినిధులు హైడ్రా కార్యకలాపాలపై ఆసక్తి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాలంటే.. పర్యావరణ సమతుల్యతను సాధించాలంటే.. హైడ్రా లాంటి వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారన్నారు. ‘చెరువుల పునరుద్ధరణలో భాగంగా ముందుగా ఆక్రమణలు తొలగించాం.. తర్వాత అభివృద్ధి చేశాం.. ఇప్పుడు ఆ ఫలాలను స్థానికులు ఆశ్వాదిస్తున్నారు. మంగళవారం భారీ వర్షం కురిసింది. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటకు భారీగా వరద నీరు చేరింది. గతంలో ఈ వరద అక్కడ బస్తీలను, కాలనీలను ముంచెత్తేది. బతుకమ్మ కుంట కాదు.. ఆ స్థలం నాది అని వాదిస్తున్న వారి మాటల్లో నిజం లేదనేది హైడ్రా పరిశోధనలో వెల్లడైంది. చెరువులను గుర్తించడంతో పాటు.. వాటి ఆక్రమణలు తొలగించడం, పునరుద్ధరించడంలో హైడ్రా చాలా శాస్త్రీయంగా ముందుకెళ్తోంది.’అని రంగనాథ్ అన్నారు. హైడ్రా ఏర్పాటు చేసి 23 నెలల్లో రూ. 1.10 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కాపాడిందని, ఈ ఏడాది మరో రూ. లక్ష కోట్ల మేర ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడే పనిలో హైడ్రా ఉందన్నారు. పేదవారికి నష్టం లేకుండానే ఇదంతా చేసిందని, బడాబాబులుగా సమాజంలో చెలామణి అవుతూ.. ఆక్రమణలకు పాల్పడినవారే హైడ్రాపై దుష్ప్రచారం చేస్తున్నారు. హైడ్రా వల్ల ప్రయోజనాలను ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు.



## ఇల్లు కూలి చిన్నారి మృతి

తాండూర్, జూన్ 10( జనం సాక్షి) : బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం అచులాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు కూలి ఎస్టీ కాలనీకి చెందిన సూనత్రి(7) మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు పని నిమిత్తం బయటికి వెళ్లగా ఇంట్లో చిన్నారి ఒంటరిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. చిన్నారి మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.



## అందుగులమేది అడవి ప్రాంతంలో సినిమా చిత్రీకరణ

ములుగు/వెంకటాపూర్,జూన్10(జనం సాక్షి): షైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న ప్రొడక్షన్ నెం.2 సినిమాను ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో ఇటీవల మంత్రి సీతక్క తనయుడు సూర్య క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా, సినిమా దర్శకుడు నేరెళ్ల దేవేందర్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా సదురు సినిమా చిత్రీకరణ వెంకటాపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో బుధవారం వెంకటాపూర్ మండలంలోని అందుగులమేది గ్రామ పరిసర ప్రాంతాల్లో సైతం సినిమా చిత్రకరణ జరిపారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నరేళ్ళ దేవేందర్ మాట్లాడుతూ... సినిమా షూటింగులకు ములుగు జిల్లా అనువైన ప్రాంతమని ఆయన కొనియాడారు.

### ఆస్తి పత్రాలు పోయాయి

నా ఒరిజినల్ సేల్ డీడ్ (డాక్యుమెంట్ నెం: 1474, రిజిస్ట్రేషన్ సంవత్సరం: 2018) పోయినది. ఆస్తి వివరాలు: సర్వే నెం 271, ప్లాట్ నెం 232, సుమారు 200చ. గజాలు, అంకుశపూర్ గ్రామం , ఘట్కేసర్ మండల్, జిల్లా మేడ్చల్ మల్కాజ్గిరి. దీనిపై జనగామ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడమైనది. ఎవరికైనా దొరికినా లేదా అభ్యంతరాలు ఉన్నా 15 రోజులలోగా సంప్రదించగలరు. లేనిచో నకిలీ పత్రాలకు దరఖాస్తు చేయబడును.

**పేరు: ఎనగందుల భాను చందర్, ఫోన్ నెంబర్: 9553334543, చిరునామా: ఇంటి నెం 4–1–8, గుండ్ల గడ్డ, జనగామ గ్రామం మరియు మండల్, జిల్లా జనగామ, తెలంగాణ.**

# రాజ్యాంగ సంస్థలు దేనికోసం..?

భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతి పెద్దది అని గర్వంగా చెప్పుకుంటాం. కానీ ఆ ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా నిలబడాల్సిన సంస్థలు నేడు ఒక తీవ్రమైన ప్రశ్నను ఎదుర్కొంటున్నాయి. అవి రాజ్యాంగానికి సేవ చేస్తున్నాయా, అధికారంలో ఉన్నవారికి సేవ చేస్తున్నాయా? ఈ ప్రశ్న కేవలం రాజకీయ విమర్శ కాదు. ఇది ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన మౌలికమైన సందేహం.

2014 తర్వాత ఈడీ దాడులు దాదాపు 27 రెట్లు పెరిగాయని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. అందులో విచారణకు గురైన రాజకీయ నాయకుల్లో 95 శాతానికిపైగా ప్రతిపక్ష నేతలే అని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇది యాదృచ్ఛికమా, లేదా వ్యవస్థాగత నిర్ణయమా అన్న సందేహం సహజంగానే కలుగుతుంది. అవినీతికి కులం లేదు, మతం లేదు, పార్టీ లేదు అని మనం చెప్పుకుంటాం. కానీ విచారణ సంస్థలు మాత్రం ఒకే రాజకీయ రంగును గుర్తిస్తున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది. చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్న సూత్రం కేవలం పుస్తకాల్లో మాత్రమే మిగిలిపోతోందా అన్న ఆందోళన కలుగుతోంది.

సంపాదకీయం

అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం.. అవినీతి ఆరోపణలు మోసుకొచ్చిన నాయకులు అధికార పార్టీలో చేరిన వెంటనే కేసులు నీరుగారిపోవడం. జనం దీన్ని "వాషింగ్ మెషీన్ రాజకీయం" అని వ్యంగ్యంగా పిలుస్తున్నారు. నిన్నటి వరకు అవినీతిపరుడు అని ముద్రపడిన వ్యక్తి, పార్టీ మారిన మరుక్షణం పవిత్రుడిగా మారిపోతున్నాడు. ఇది చట్టానికి అపచారం మాత్రమే కాదు, ప్రజల మేధస్సును అవమానించడం కూడా. ఈ పరిణామాలు చూస్తున్న సామాన్య పౌరుడికి ఒక్కటే అనిపిస్తుంది. చట్టం బలవంతుడికి అనుకూలంగా, బలహీనుడికి వ్యతిరేకంగా పనిచేస్తోంది.

మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించిన తీరు అనేక ప్రశ్నలకు తావిచ్చింది. సాంకేతిక కారణాలు చూపినా, అదే సాంకేతిక లోపాలు అధికార పార్టీ అభ్యర్థులకు వర్తించని సందర్భాలు కళ్ళముందే కనిపిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణ సంస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే, ఓటు హక్కుకే అర్థం లేకుండా పోతుంది. ప్రజలు బాక్సులో వేసే ఓటు ఒకవైపు, వ్యవస్థ తీసుకునే నిర్ణయాలు మరొక వైపు ఉంటే.. ప్రజాస్వామ్యం కేవలం నాటకంగా మిగిలిపోతుంది.

సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను విభాగం ఈ సంస్థలు రాజ్యాంగ స్ఫూర్తితో సృష్టించబడ్డాయి. వాటి నిష్పక్షపాత స్వభావమే వాటి నైతిక బలం. కానీ నేడు ఈ సంస్థల అధికారులు రాజకీయ నాయకత్వానికి జవాబుదారీగా మారుతున్నారన్న విమర్శ రోజురోజుకూ బలపడుతోంది. సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో ఈ సంస్థల వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థ అత్యున్నత స్థాయి నుండే ఇలాంటి మాటలు వస్తున్నాయంటే.. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. విచారణ అంటే నిజాన్ని వెలికితీయడం. కానీ అది ఎంపిక చేసిన వారిపై మాత్రమే జరిగినప్పుడు, అది విచారణ కాదు, వేధింపు అవుతుంది.

ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ప్రతిపక్షం బలంగా ఉండాలి. బలమైన ప్రతిపక్షం లేకుండా అధికార పక్షానికి జవాబుదారీతనం ఉండదు. విమర్శించే గొంతులు అణచివేయబడినప్పుడు, ప్రజాస్వామ్యం నిర్జీవమవుతుంది. ప్రతిపక్ష నాయకులను నిరంతర విచారణల భయంలో ముంచెత్తడం వల్ల వారు రాజకీయంగా నిర్వీర్యమవుతారు. అప్పుడు ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం కరువవుతుంది. ఇది ఒక్క పార్టీకి నష్టం కాదు, మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం. ఈ వ్యవహారం కొనసాగితే న్యాయవ్యవస్థపై, ఎన్నికల వ్యవస్థపై, మొత్తం పాలనా యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసం పోతుంది. విశ్వాసం పోయిన ప్రజాస్వామ్యం, ఒక డొల్ల చెట్టు వంటిది. బయటకు నిటారుగా కనిపించినా, లోపల్నుంచి పుచ్చిపోతుంది.

సంస్థల స్వాయత్తతకు రాజ్యాంగ రక్షణ మరింత బలోపేతం కావాలి. ఈడీ, సీబీఐ డైరెక్టర్ నియామకాలు పారదర్శంగా, ద్విపక్ష సమ్మతితో జరగాలి. విచారణలు ప్రారంభమైనప్పుడు, మూసివేయబడినప్పుడు బహిరంగ జవాబుదారీతనం తప్పనిసరి కావాలి. అధికారంలో ఉన్న పార్టీ మారినా, సంస్థలు మారకూడదు. అదే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఈ సంస్థలు న్యాయానికి మాత్రమే నిష్ఠగా ఉండాలి. అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ ఒకే గీత వర్తించాలి. అప్పుడు మాత్రమే ప్రజలు వ్యవస్థను నమ్ముతారు. అప్పుడు మాత్రమే భారతదేశం నిజంగా ప్రజాస్వామ్య గణతంత్రం అని చెప్పుకోగలం, కేవలం రాజ్యాంగంలో రాసుకోవడానికి మాత్రమే కాదు, ఆచరణలో చూపించడానికి కూడా...!

# ద్రవ్యోల్బణం - ఆర్థిక వృద్ధి : ఈ సవాల్ ఎదుర్కోవడం ఎలా!?



భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక క్లిష్టమైన కూడలిలో నిలబడి ఉంది. ఒకవైపు వేగవంతమైన ఆర్థిక వృద్ధిని కొనసాగించాల్సిన అవసరం, మరోవైపు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాల్సిన బాధ్యత విధాన నిర్ణేతల ముందున్న ప్రధాన సవాలుగా మారింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఎప్పుడూ సులభం కాదు. అయితే ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, యుద్ధాలు, ఇంధన ధరల హెచ్చుతగ్గులు, వాతావరణ మార్పులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు వంటి అంశాలు భారతదేశం ఎదుర్కొంటున్న ఈ సవాలును మరింత క్లిష్టతరం చేస్తున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. కోవిడ్ మహమ్మారి తరువాత అనేక దేశాలు ఆర్థిక మాంద్యంతో పోరాడుతుండగా, భారతదేశం మాత్రం వృద్ధి రేటును నిలబెట్టుకో గలిగింది. సేవారంగం, సమాచార సాంకేతిక రంగం, తయారీ రంగం, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులు పెరగడం వల్ల దేశీయ ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, ఆర్థిక వృద్ధి ఎంత ముఖ్యమో ధరల స్థిరత్వం కూడా అంతే ముఖ్యమైనది. ప్రజల ఆదాయం పెరిగినా, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు తప్పితే ఆ వృద్ధి ప్రయోజనాలు సాధారణ ప్రజలకు చేరవు.

ద్రవ్యోల్బణం అనేది కేవలం ఒక ఆర్థిక గణాంకం మాత్రమే కాదు. అది ప్రజల దైనందిన జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసే అంశం. బియ్యం, పప్పులు, కూరగాయలు, వంటనూనెలు, విద్యుత్, ఇంధనం వంటి అవసరమైన వస్తువుల ధరలు పెరిగినప్పుడు మొదట దెబ్బతినేది మధ్యతరగతి, పేద ప్రజలే. ముఖ్యంగా స్థిర ఆదాయం కలిగిన కుటుంబాలు, పెన్షనర్లు, రోజువారీ కూలీలు అధిక ధరల భారాన్ని ఎక్కువగా అనుభవిస్తారు. అందుకే ద్రవ్యోల్బణ నియంత్రణను ఏ కేంద్ర బ్యాంకు కూడా నిర్లక్ష్యం చేయలేదు.

అయితే ప్రస్తుత పరిస్థితిలో ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణం ప్రజల అధిక కొనుగోలు శక్తి కాదు. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరల పెరుగుదల, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, రవాణా వ్యయాల పెరుగుదల, సరఫరా గొలుసులలో ఏర్పడుతున్న అంతరాయాలు ముఖ్య కారణాలుగా కనిపిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నుంచి ప్రారంభమైన ఇంధన మార్కెట్ అస్థిరత ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. దానికి తోడు పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతదేశం తన ఇంధన అవసరాలలో గణనీయమైన భాగాన్ని దిగుమతులపై ఆధారపడి తీర్చుకోవడం వల్ల అంతర్జాతీయ ధరల ప్రభావం నేరుగా దేశీయ ద్రవ్యోల్బణంపై పడుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ రేట్లను పెంచడం ఒక్కటే పరిష్కారం కాదు. సాధారణంగా ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ ఎక్కువై ధరలు పెరిగితే వడ్డీ రేట్లు పెంచడం ద్వారా డిమాండ్‌ను తగ్గించవచ్చు. కానీ సరఫరా వైపు సమస్యల వల్ల ధరలు పెరుగుతున్నప్పుడు వడ్డీ రేట్ల పెంపు పరిమిత ఫలితాలనే ఇస్తుంది. పైగా అధిక వడ్డీ రేట్లు పరిశ్రమలు, వ్యాపారాలు, గృహ రుణ గ్రహీతలపై అదనపు భారం మోపుతాయి. ఫలితంగా పెట్టుబడులు తగ్గి వృద్ధి మందగించే ప్రమాదం ఉంటుంది. అందుకే భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తూ పరిస్థితులను పరిశీలించే విధానాన్ని అవలంబిస్తోంది.

మరోవైపు వ్యవసాయ రంగం పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. భారతదేశంలో ఇప్పటికీ కోట్లాది ప్రజల జీవనాధారం వ్యవసాయమే. రుతుపవనాలు బలహీనంగా ఉంటే ఆహార ధాన్యాలు, కూరగాయలు, పప్పుధాన్యాల ఉత్పత్తి దెబ్బతింటుంది. ఉత్పత్తి తగ్గితే ధరలు పెరుగుతాయి. అదే సమయంలో రైతుల ఆదాయం తగ్గుతుంది. ఇది గ్రామీణ వినియోగాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి తగ్గితే ద్విచక్ర వాహనాలు, ఎరువులు, సిమెంట్, వస్త్రాలు వంటి అనేక రంగాలపై ప్రభావం పడుతుంది. అందువల్ల వ్యవసాయం, ద్రవ్యోల్బణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరస్పర సంబంధం కలిగిన అంశాలుగా చూడాల్సి ఉంటుంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు కూడా భారతదేశానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. అమెరికా, యూరప్, చైనా వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి మందగిస్తే భారత ఎగుమతులపై ప్రభావం పడుతుంది. విదేశీ పెట్టుబడిదారులు అనిశ్చిత పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతారు. దీంతో అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి మూలధనం బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది. రూపాయి విలువలో హెచ్చుతగ్గులు దిగుమతి వ్యయాలను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ భారతదేశం వద్ద ఉన్న విదేశీ మారక నిల్వలు ఈ తరహా షాక్‌లను కొంతవరకు తట్టుకునే సామర్థ్యాన్ని అందిస్తున్నాయి.

అయితే ఆర్థిక వృద్ధి గణాంకాలను మాత్రమే విజయ సూచికగా భావించడం సరిపోదు. వృద్ధి ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతున్నాయా లేదా అనేది కూడా అంతే ముఖ్యమైన ప్రశ్న. జీడీపీ పెరుగుతున్నప్పటికీ నిరుద్యోగం కొనసాగితే, యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించకపోతే, ఆదాయ అసమానతలు పెరిగితే ఆ వృద్ధి సుస్థిరంగా ఉండదు. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చగలిగితేనే దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమవుతుంది.

అందువల్ల ద్రవ్య విధానం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం కాదని అర్థం చేసుకోవాలి. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నిల్వ సదుపాయాల విస్తరణ, రవాణా వ్యయాల తగ్గింపు, ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, ఉద్యోగాల సృష్టి వంటి చర్యలు సమాంతరంగా కొనసాగాలి. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణ నియంత్రణ పరస్పర విరుద్ధ లక్ష్యాలు కావు. సరైన విధాన సమన్వయం ఉంటే రెండింటినీ సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యమే.

భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు ఇప్పటికీ బలంగానే ఉన్నాయి. అయితే ప్రపంచ అనిశ్చితి, ఇంధన ధరల ఒత్తిడి, వాతావరణ మార్పులు, ఆహార భద్రత సవాళ్లు, ఉపాధి సమస్యలు వంటి అంశాలను తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. ముందుచూపుతో కూడిన విధానాలు, సమన్వయంతో కూడిన పాలన, ఉత్పాదక రంగాల బలోపేతం, సామాజిక న్యాయాన్ని దృష్టిలో ఉంచుకున్న అభి వృద్ధి వ్యూహం ద్వారా మాత్రమే భారతదేశం ద్రవ్యోల్బణం - వృద్ధికి మధ్య ఉన్న ఈ సున్నితమైన మార్గాన్ని విజయవంతంగా అధిగమించగలదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## "అపహరించబడ్డ రాముడు"

అలనాటి కథల్లోని కోదండరాముడు
చెడును చీల్చేయడానికి విల్లెక్కుపెడితే
నేడు మతోన్మాదులచే
చెరబడ్డ కౌసల్యరాముడు
మసీదులపై మత విద్వేషపు విల్లెక్కుపెడుతున్నాడు
భక్తి భజనలతో పరవశించి
నలుదిక్కులు ధ్వనించిన నాటి శ్రీరాముని నామం
నేడు చంపేస్తాం మొక్కమంటూ బాధించి
బయటపెట్టి బలవంతంగా చర్చిలలో
చొరబడుతోంది
ఆనాటి అయోధ్య రాముడు రాజ్య సమృద్ధికి
రాజ కిరీటం ధరిస్తే
నేటి అధికార వ్యామోహపు అరచేతికి చిక్కిన
రఘురాముడు
అభివృద్ధి రహిత భారతానికి అన్నింటా అడ్డు
పెట్టుకునే భూటకపు గుడిగోడల మధ్య
అలంకరించబడ్డాడు
అలనాటి గాథల్లో మంచి బాలునిగా కీర్తించబడ్డ
సీతారాముడు
నేటి ఆదర్శ హిందువుల స్పృహలేనితనానికి
రాబోయే తరాలకు
రాజకీయ రౌడీలచే నవ భారత రాక్షసుడిగా
రూపుమారబోతున్నాడు.
తస్మాత్ జాగ్రత్త!

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత, 8639442397.

# ప్రజల కొనుగోలు శక్తే మహా శక్తి

*"మహా మహా బహుళ జాతి సంస్థలను దివాలా తీయించడం ప్రజల చేతుల్లో నే ఉంది.*

ప్రజలు సినిమా చూడక పోతే నిర్మాత దివాలా తీస్తారు. పారిశ్రామికవేత్తల సరుకులు కొనక పోతే ఏడాదిలో కనుమరుగవుతారు.

**1. ఉత్పత్తి మరియు సరుకు లభ్యత యొక్క త్రితత్వ గతితర్కం**

రాజకీయ అర్థశాస్త్ర నిర్మాణంలో, సరుకు ఉత్పత్తి కోసం పెట్టుబడి పెట్టడం అనేది కేవలం మొదటి దశ మాత్రమే. సరుకును నాణ్యంగా, చవకగా ఉత్పత్తి చేయడం అనేది మరొక ప్రత్యేకమైన ఆచరణాత్మక సవాలు. అయితే, అన్నింటికంటే మౌలికమైన వ్యవస్థాగత సవాలు మార్కెట్ విస్తరణ మరియు అమ్మకంలోనే ఉంది. ఈ వ్యూహాత్మక వాణిజ్యం, పంపిణీ మరియు చలనం ద్వారానే పెట్టిన అసలు పెట్టుబడిని, శ్రమశక్తి విలువను మరియు శ్రమశక్తి అదనపు విలువను తిరిగి రాబట్టుకోవడం సాధ్యమవుతుంది.

ఈ మూడు గమనాలు-ఉత్పత్తి, ఆప్టిమైజేషన్ (సమన్వయం) మరియు అమ్మకం-ఒకే వ్యవస్థగా కలిసి పనిచేసినప్పుడే, ఆ సరుకుకు సమాజంలో స్థిరమైన ప్రతిష్ట (గుడ్‌విల్) మరియు ట్రేడ్‌మార్క్ విలువ ఏర్పడతాయి. ఈ సమన్వయం వల్ల సరుకులు ప్రజల నిత్యజీవిత అవసరాల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోతాయి. తద్వారా, ఆధునిక యుగ సాంకేతిక-సామాజిక చైతన్యానికి అనుగుణంగా సమాజానికి, ప్రపంచానికి నాయకత్వం వహించడం సాధ్యపడుతుంది. శ్రమశక్తి అదనపు విలువను మార్కెట్ అమ్మకం ద్వారా తిరిగి రాబట్టుకోలేకపోతే, కొత్త పెట్టుబడులు పుట్టే మార్గం పూర్తిగా మూసుకుపోతుంది. అంతేకాకుండా, అలా రాబట్టుకున్న అదనపు విలువను తిరిగి ఉత్పాదక రంగాల్లోకి కొత్త పెట్టుబడిగా మళ్లించకపోతే, మానవ సమాజ ఆర్థిక పరిణామం ఆగిపోతుంది. దీనివల్ల సామాజిక శ్రేణులు శిథిలమై, వ్యవస్థాగత క్షీణత ఏర్పడుతుంది.

**2. సంపద దుర్వినియోగం:**
**అనుత్పాదక వినియోగం వర్సెస్ ఉత్పాదక పెట్టుబడి**

సమాజంలో వేల కోట్ల రూపాయల సంపద పెట్టుబడిగా మారకుండా వృధా అవుతోంది. ఇది అట్టహాసాలు, సాంప్రదాయాలు, పండుగలు, యుద్ధాలు, రాజకీయ పేజీలు, బ్యూరోక్రాటిక్ సభలు మరియు దేశరక్షణ ఆయుధాల రూపంలో అనుత్పాదకంగా కరిగిపోతోంది. రక్షణ బడ్జెట్‌లో కేవలం పదో వంతును ప్రజా విద్యకు కేటాయిస్తే, ఇప్పుడున్న స్కూళ్లు, యూనివర్సిటీల సంఖ్య మరియు వాటి వసతులు క్షణాల్లో రెట్టింపవుతాయి.

ఈ వ్యవస్థాగత లోపాన్ని ఒక వ్యవసాయ పర్యావరణ ఉదాహరణతో అర్థం చేసుకోవచ్చు: చెరువులోని నీరు పంట పొలాలకు సమంగా వినియోగించినప్పుడే ఉత్పత్తి పెరుగుతుంది. ఆ నీరు చెరువులోనే వృధాగా పడివున్నా, లేదా పొలాలకు కాకుండా వృధాగా మురికి కాలువల్లోకి పోయినా.. రెండూ వృధాయే. అదేవిధంగా, డబ్బు అనేది ఉత్పాదక పెట్టుబడిగా మారకుండా వృధాగా మూలుగుతున్నా, లేదా దుబారా ఖర్చు చేసినా సమాజానికి నష్టమే జరుగుతుంది. ఈ సూత్రం మానవ మేధస్సుకు కూడా వర్తిస్తుంది. పత్రికలకు ఏమీ రాయని అకడమిక్ మేధావులు, ప్రజల వద్దకు వెళ్లి తమ జ్ఞానాన్ని అందించని మేధావులు ఈ దేశంలో ఒక రకమైన అనుత్పాదక ఆస్తిని కూడబెడుతున్నారు.,

**3. ఆర్థిక సామ్రాజ్యవాదం , బ్రాహ్మణీయ ఆధిపత్య విస్తరణ**

పెట్టుబడిదారీ విధానం అనేది లాభాల కోసం, మార్కెట్ ఆధిపత్యం కోసం పోటీదారుల మధ్య జరిగే ఘర్షణతో నడుస్తుంది. ఈ పోటీ సాంకేతిక అభివృద్ధిని వేగవంతం చేస్తూనే, ఒకానొక దశలో పోటీదారులు లేని ఏక స్వామ్య రాజకీయార్థిక వ్యవస్థను కోరుకుంటుంది. దీని అత్యున్నత రూపమే ద్రవ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం వంటి ఆధునిక అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా మేధస్సును, టెక్నాలజీని, వ్యక్తిగత ఆస్తి తాలూకు గుడ్‌విల్ మరియు ట్రేడ్‌మార్క్ హక్కుల పరిధిలోకి తెచ్చారు. ఇది మానవ ప్రపంచ చరిత్రలో మునుపెన్నడూ ఎరుగని కొత్త పరిణామం.

**4. ప్రాథమిక వర్గంగా పెట్టుబడి, సామాజిక రుణం**

"పెట్టుబడి" అనే మౌలిక సామాజిక వర్గం లేకపోతే మార్క్సిజం లేదు, మానవ సమాజ వికాసమూ లేదు. మానవ సమాజ పరిణామానికి పెట్టుబడి అనేది ప్రాథమిక అవసరం. వర్తమాన చైతన్యానికి గత చరిత్ర ఒక పెట్టుబడిగా ఉనికిలో ఉంటుంది. శ్రామిక వర్గాల వైపు నుండి దీనిని విశ్లేషించడం నుంచే చారిత్రక భౌతికవాదం రూపుదిద్దుకుంది.

ఈ పెట్టుబడి సూత్రం కుటుంబ వ్యవస్థ లోపల కూడా పనిచేస్తుంది. పిల్లల పట్ల తల్లిదండ్రులు చేసే పెంపకం, చదువు అంతా ఒక రకమైన సామాజిక పెట్టుబడి నిర్వహణే. ఈ నిర్మాణంలో 'కృతజ్ఞత' అనేది ఇతరుల నుండి తీసుకున్న పెట్టుబడిని తిరిగి చెల్లించడానికి సంబంధించిన ఒక ఆర్థిక-నైతిక సూత్రం. ఎదిగిన పిల్లలు తల్లిదండ్రులకు తిరిగి పెట్టుబడిగా మారుతారు. అందువల్ల, "నీ మీద ఇంత పెట్టుబడి పెట్టి చదివించాం, మా ముసలితనంలో ఆదుకుంటావా?" అని తల్లిదండ్రులు అడిగే సాధారణ ప్రశ్న వెనుక ఒక లోతైన శాస్త్రీయ అర్థశాస్త్ర నియమం ఉంది..

ఒక రైతుకు రెండు ఎకరాల భూమి ఉండి, మార్కెట్ సూత్రాలు తెలియక, దిగుబడి సామర్థ్యం పెంచడం చేతకాక, పండుగలు, పెళ్లిళ్ల అట్టహాసాలకు దుబారా ఖర్చు చేస్తూ, అధిక సంతానాన్ని కంటే.. ఆ పిల్లలు అర ఎకరం గల సన్నకారు రైతులై చివరికి కూలీలుగా మారుతారు. భూమిని దున్నేవాడికి పంచినా, జనాభా పెరుగుదల వల్ల మళ్లీ మొదటికే వస్తుంది. అందువల్ల, ఈ హెచ్చుతగ్గుల్ని నివారించాలంటే.. వ్యక్తిగత బాధ్యతా రాహిత్యానికి, పండుగల వృధా వ్యయాలకు, అధిక జనాభాకు వ్యతిరేకంగా ఒక సాంస్కృతిక విప్లవం రావాలి. దీనిని రాజకీయ, నైతిక విప్లవంలో భాగం చేయడమే సమగ్ర సామాజిక విప్లవం.

**5. నిర్వహణ సామర్థ్యం, నూతన సాంకేతిక కుల చైతన్యం**

నిర్వహణ సామర్థ్యం అనేది ఒక విశిష్టమైన మేధో పెట్టుబడి - ఒక ఉన్నత శ్రమశక్తి. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలలో ఒక కొత్త 'మేనేజీరియల్ క్లాస్' (నిర్వహణ వర్గం) ఏర్పడింది. ఇది సమాజంలో ఒక సరికొత్త లౌకిక బ్రాహ్మణ కులం లాగా ఎదిగిందని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా గారే ముందే గుర్తించారు. నేటి గ్లోబల్ యుగంలో సంస్కృతి, జాతీయ భావాలు పటాపంచలైపోయి, కేవలం స్వీయ ప్రయోజనాలు, నిర్వహణ సామర్థ్యమే ప్రపంచాన్ని శాసించే శక్తులుగా ముందుకు వస్తున్నాయి. ఆ పిల్లలు వ్యాపార కిటుకులను (నిర్వహణను) నేర్చుకుని, కాలక్రమేణా వర్కింగ్ పార్ట్‌నర్లుగా మారి కొత్త వ్యాపారాలు ప్రారంభించారు.

**6. రాజ్య ఉనికి, వర్తమాన ఆచరణ**

రాజ్యం అనేది ఎక్కడో ఆకాశంలో లేదు, అది ఎపుడో పుట్టి ఇప్పుడు కొనసాగడం లేదు. అది మీ ఇప్పటి రోజువారీ ఆచరణలో, నిర్వహణలో ఇప్పుడే పుడుతున్నది. గతం యొక్క రాజ్యంతో నీవు ఏర్పరుచుకునే సంబంధాన్ని బట్టే అది ఉనికిలోకి వస్తుంది. వర్తమానం అనే విద్యుత్తు గతంలోకి ప్రవహించినప్పుడే గతం చైతన్యవంతమై నీ ముందు నిలబడి నిన్ను శాసిస్తుంది. గతం అనేది మన వర్తమాన స్పృహతో ముడిపడినప్పుడే దాని చర్య మనపై పనిచేయడం మొదలవుతుంది (ఉదాహరణకు: సింధు నాగరికత తవ్వకాల ద్వారా బయటపడేవరకు దాని ఉనికి సమాజ చైతన్యాన్ని ప్రభావితం చేయలేదు). ఈ నేపథ్యంలో, ధ్యానం అనేది గతం యొక్క పీడ, మానసిక గాయాల ప్రభావం నీ మీద లేకుండా చేసి, నిన్ను ఈ వర్తమాన క్షణంలో జీవించేట్టు చేసే ఒక మానసిక ప్రక్రియ.


**7. విప్లవాత్మక ఆయుధంగా వినియోగదారుని చైతన్యం**

కులం గానీ, రాజ్యం గానీ అనుక్షణం ఆచరించకపోతే ఈ క్షణమే అదృశ్యమవుతాయి. ప్రతినిత్యం కులాన్ని సంస్కృతి రూపంలో, పెట్టుబడి రూపంలో, రక్తసంబంధాలు, స్నేహాలు, రాజకీయాల రూపంలో ఆచరించడం వల్లనే అది కొనసాగుతున్నది. అందువల్ల మనం గతంలోకో, భవిష్యత్తులోకో పరిగెత్తడం కాదు; ఈ వర్తమానంలో జీవించాలి. స్త్రీవాదులు వర్తమాన నిత్యజీవితంలోని ప్రతి కదలిక నుండి, ప్రతి మాట నుండి మగపెత్తనం ఎలా ఆచరించబడుతున్నదో చెప్పగలుగుతున్నారు. దళితులు, బహుజనులు కూడా అలా ప్రతి సామాజిక కదలిక, పాట, ఆటల నుంచి కులాధిక్యత ఎలా పనిచేస్తుందో స్పష్టం చేయగలగాలి.

అంతేకాకుండా, మన కొనుగోలు శక్తే అవతలి వాడి పెట్టుబడిని పెట్టుబడిగా నిలబెడుతోంది. మనం కొనడం మానేస్తే బహుళజాతి కంపెనీలు సైతం ఏడాదిలో బోర్డు తిప్పేసి ఈ దేశం వదిలి పారిపోతాయి. మన కొనుగోలు శక్తి ప్రతిక్షణం లైఫ్‌బాయ్ లేదా రెక్సోనా వంటి కార్పొరేట్ సరుకులకు ప్రాణం పోస్తోంది. మనం మన శ్రమశక్తి రూపాన్ని డబ్బు రూపంలో ఇచ్చి "కొనడం" ద్వారానే ఆ సరుకు, ఆ పెట్టుబడి సజీవమవుతున్నాయి. ఎన్ని పరిమితులున్నా మహాత్మా గాంధీ ప్రయోగించిన మహత్తర ఆయుధం ఇదే-"నిన్ను కొనను, నువ్వు నాకు అవసరం లేదు." మార్క్స్ సిద్ధాంతం 'అమ్మేవాడి' కోణం నుండి పుడితే, గాంధీ సిద్ధాంతం 'కొనుగోలుదారుడి' కోణం నుండి పుట్టింది. నేడు ఆసియా ప్రపంచానికి అతిపెద్ద వినియోగ కేంద్రంగా మారగా, పాశ్చాత్య దేశాలు ప్రధాన అమ్మకందారులుగా మిగిలాయి.

**8. బైసెక్టోరల్ తగ్గింపువాద విమర్శ: త్రితత్వ గతితర్కం**

మార్క్సిస్టులు చెప్తున్నట్టుగా-మానవ సంబంధాలన్నీ కేవలం ఆర్థిక సంబంధాలు కావు; కానీ ఆర్థిక సంబంధాలన్నీ ఖచ్చితంగా మానవ సంబంధాలే. స్త్రీవాదులు చెప్తున్నట్టుగా-మానవ సంబంధాలన్నీ కేవలం రాజకీయ, సాంస్కృతిక సంబంధాలు కావు; కానీ రాజకీయ, సాంస్కృతిక సంబంధాలన్నీ ఖచ్చితంగా మానవ సంబంధాలే. స్కూళ్లలో విద్యా కమిటీ, పేరెంట్స్ కమిటీ, మేనేజ్మెంట్ కమిటీ, స్టూడెంట్స్ కమిటీల సమన్వయంతో నిర్వహణ సాగినట్లే.. సమస్త ఉత్పత్తి రంగాలలో వినియోగదారుల, కార్మికుల కమిటీలు భాగస్వామ్యం వహించాలి. అప్పుడే రాజ్యం నిజమైన అర్థంలో ప్రజాస్వామికరించబడుతుంది. మార్క్సిజం దీనికి తలకిందులుగా కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనే వ్యవస్థను ప్రతిపాదించింది. తద్వారా తానే మునుపెన్నడూ లేనంత నిరంకుశ రాజ్య వ్యవస్థగా మారింది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# పిల్లల మనసుల్లో విలువలు నింపుదాం



నేటి ఆధునిక యుగంలో పిల్లలకు నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం, భౌతిక సౌకర్యాలు అందించడంపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నా రు. అయితే పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, కుటుంబ బంధాల బలోపేతానికి, సామాజిక విలువల పెంపొందింపుకు అత్యంత అవసరమైనది ఇంటి వాతావరణం, పెద్దల మాటలు, వారి ప్రవర్తనే అనే విషయాన్ని మరచిపోకూ డదు. పిల్లలు చెప్పింది మాత్రమే కాదు,చూసింది కూడా అనుకరిస్తారు. తెలంగాణలో సామెత గుర్తొస్తుంది. "ఆవు చేన్ల మేస్తే దూడ గట్టుకు మేస్తుందా!". అందుకే ఇంట్లో వినిపించే ప్రతి మాట, కనిపించే ప్రతి చర్య వారి భవిష్యత్తు జీవితానికి పునాదిగా నిలుస్తోంది.

**ప్రేమతో కూడిన మాటలే తొలి పాఠశాల**

పిల్లల జీవితంలో కుటుంబమే మొదటి పాఠశాల. తల్లిదండ్రులే తొలి గురువులు. పిల్లలతో మాట్లాడే విధానం వారి ఆలోచనా విధానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, భావోద్వేగ వికాసాన్ని ప్రభావితం చేస్తుంది. కోపంతో, అవమానకరంగా మాట్లాడడం వల్ల పిల్లల్లో భయం, నిరాశ, ఆత్మన్యూనతాభావం పెరిగే అవకాశం ఉంటుంది. అదే ప్రేమతో, ఓర్పుతో, ప్రోత్సాహకరంగా మాట్లాడితే వారు ధైర్యంగా ఎదుగుతారు. పిల్లలు తప్పులు చేసినప్పుడు తిడుతూ కాకుండా, వాటిని సరిదిద్దే మార్గం చూపాలి. వారి చిన్న విజయాలను కూడా అభినందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒక మంచి మాట పిల్లల మనసులో ఆశను నింపగలదు. ఒక కఠినమైన మాట వారిని లోలోపల గాయపరచగలదు. అందుకే తల్లిదండ్రుల మాటల్లో ప్రేమ, మమకారం, బాధ్యత ప్రతిఫలించాలి.

**కుటుంబ బంధాలే విలువల విత్తనాలు**

సాంకేతికత పెరిగిన కొద్దీ కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఒక్కొక్కరు ఒక్కో ప్రపంచంలో జీవిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో కుటుంబ బంధాలను కాపాడుకోవడం అత్యంత అవసరం. తాతలు, అమ్మమ్మలు, బంధువులు, సోదరులు, సోదరీమణులతో అనుబంధాలు పెంచుకోవడం ద్వారా పిల్లలు గౌరవం, ఆప్యాయత, పరస్పర సహకారం వంటి విలువలను నేర్చుకుంటారు. కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేయడం, పండుగలను సంబరంగా జరుపుకోవడం, ఒకరి సమస్యలను మరొకరు పంచుకోవడం వంటి అలవాట్లు కుటుంబ ఐక్యతను పెంచుతాయి. బలమైన కుటుంబ బంధాలు ఉన్న చోట పిల్లలు భావోద్వేగంగా దృఢంగా ఉంటారు. ఒత్తిళ్లు, సమస్యలు ఎదురైనప్పుడు కూడా కుటుంబం తమకు అండగా ఉందనే నమ్మకం వారిలో ధైర్యాన్ని నింపుతుంది. కుటుంబం కేవలం రక్త సంబంధం కాదు; ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యతల సమాహారం అని పిల్లలకు తెలియజేయాలి.

**సామాజిక బాధ్యతల వైపు చిన్నారుల అడుగులు**

పిల్లలు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి సమాజ నిర్మాణంలోనూ కీలక భాగస్వాములు. కాబట్టి చిన్ననాటి నుంచే వారిలో సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించాలి. పెద్దలను గౌరవించడం, అవసరమైన వారికి సహాయం చేయడం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆస్తుల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ ఆచరణ ద్వారా పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. ట్రాఫిక్ నియమాలు పాటించడం, పరిశుభ్రతను కాపాడడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, చెట్లు నాటడం వంటి చిన్న చిన్న చర్యలే పిల్లల్లో సామాజిక చైతన్యాన్ని పెంచుతాయి. సమాజం పట్ల బాధ్యత కలిగిన పిల్లలే రేపటి మంచి నాయకులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయు లు, ప్రజాసేవకులుగా ఎదుగుతారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించే మనస్తత్వం వారికి అలవడాలి.

**డిజిటల్ యుగంలో తల్లిదండ్రుల బాధ్యత కీలకం**

నేటి పిల్లల ప్రపంచం ఎక్కువగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ పరికరాల చుట్టూనే తిరుగుతోంది. సాంకేతికత అవసరమే అయినప్పటికీ, దాని వినియోగంపై తల్లిదండ్రులు సరైన మార్గనిర్దేశం చేయాలి. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారి భావాలను వినడం, పుస్తక పఠనం, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం అవసరం. డిజిటల్ ప్రపంచం ఎంత విస్తరించినా, తల్లిదండ్రుల ప్రేమను, కుటుంబ అనుబంధాలను, మానవీయ విలువలను ఏ సాంకేతికత భర్తీ చేయలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పిల్లలకు సమయం ఇవ్వడం కూడా వారికి ఇచ్చే గొప్ప బహుమతుల్లో ఇదే ప్రధానమైంది.

**పిల్లల హృదయాల్లో విలువలు నింపుదాం..**

పిల్లలకు ఆస్తులు, డబ్బు, సౌకర్యాలు అందించడం కంటే మంచి సంస్కారం, కుటుంబ అనుబంధాలు, సామాజిక విలువలు అందించడం ఎంతో గొప్ప బాధ్యత. ప్రేమతో కూడిన మాటలు, ఆదర్శవంతమైన ప్రవర్తన, ఆప్యాయమైన కుటుంబ వాతావరణం పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తాయి. నేడు మనం పిల్లల మనసుల్లో నాటే మంచి ఆలోచనలు, సంస్కారం, విలువలే రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే శక్తిగా మారతాయి. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే వారి చెవుల్లో మంచి మాటలు, వారి కళ్ల ముందు మంచి ఆదర్శాలు, వారి హృదయాల్లో మానవీయ విలువలు నింపుదాం. అదే కుటుంబానికి, సమాజానికి, దేశానికి మనం అందించే నిజమైన సేవ.



మేదాజీ (మేకిరి దామోదర్)
సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్,
ఫోన్ :9573666650.

## సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



**మల్కాజిగిరి, జూన్ 10 (జనంసాక్షి) :** పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తూ సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. వెంకటేశ్వర నగర్ శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మరియు టీపీసీసీ ఉపాధ్యక్షులు సమీర్ కౌశల్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డివిజన్ల పరిధిలోని బూత్ స్థాయి ఏజెంట్లందరూ సమావేశంలో అందించిన మార్గదర్శకాలు, సూచనలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ, తమ తమ బూత్‌లలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి కాంగ్రెస్ ఇంచార్జ్ తోట లక్ష్మీ కాంత్ రెడ్డి, చంద్ర శేఖర్,బికె. శ్రీనివాస్, గుండా నిరంజన్, జిఎన్వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, బీఎల్ఓలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

- పండుగలకు అల్లుళ్లకు హెల్మెట్‌ను బహుమతిగా ఇవ్వండి
- ఫసల్వాది గ్రామ సభలో "ఆరైవ్ అలైవ్ " సందేశం
- తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 10 (జనం సాక్షి) :** ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ సూచించారు. సంగారెడ్డి మండలంలోని ఫసల్వాది గ్రామ సభలో బుధవారం గ్రామ సభ, "ఆరైవ్ అలైవ్ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్ హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్న మొబైల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే, స్క్రీన్ గార్డ్ వేయిస్తామని, మొబైల్ కంటే మన ప్రాణాలు, మన ప్రయాణం ఎంతో విలువైనవని గుర్తించాలని సూచించారు. మన ప్రాణరక్షణలో భాగమైన హెల్మెట్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులందరూ సీటు బెల్ట్ ధరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపరాదని, మద్యం సేవించినట్లయితే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించాలని తెలిపారు. పండుగలకు అల్లుళ్లకు కొత్త బట్టలు బహుమతిగా ఇచ్చే సంప్రదాయం తెలంగాణ ప్రజలదని, తన తరఫున ఒక సూచనగా వారి ప్రాణరక్షణకు ఉపయోగపడే హెల్మెట్‌ను బహుమతిగా ఇస్తే మరింత మంచిదని అన్నారు. రహదారులపై వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. యువత ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫసల్వాది గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ..ఈ సభ వేదికగా ఈ రోజు నుంచి హెల్మెట్, సీటు బెల్ట్ ధరించనిదే గ్రామంలోని ఎవరికీ అనుమతి లేదని తీర్మానం చేసుకుంటున్నట్లు తెలిపారు. (నో హెల్మెట్ – నో ఎంట్రి) విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. దేశంలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని, ట్రాఫిక్ నిబంధనలపై తమ ఫసల్వాది గ్రామంలో అవగాహన కల్పించేందుకు "ఆరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ...సంగారెడ్డి జిల్లా ప్రజలను రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తం చేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్ ఫసల్వాడి గ్రామానికి రావడం "ఆరైవ్ అలైవ్ " కార్యక్రమ ప్రాధాన్యతను తెలియజేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... "ఆరైవ్



అలైవ్ " అంటే మన ప్రయాణం సురక్షితంగా సాగి, గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడం అని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. జుట్టు చెడిపోతుందనో, సీటు బెల్ట్ వేసుకుంటే అసౌకర్యంగా ఉంటుందనో భావించి అజాగ్రత్తగా వ్యవహరించవద్దని అన్నారు. కుటుంబ యజమానిని కోల్పోతే ఆ కుటుంబానికి కలిగే నష్టం తీర్చలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎంహెచ్‌వో లలిత, ఆర్డీవో రాజేందర్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎమ్మార్వో దశరథ్, జిల్లా పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలలో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- డిఎస్‌పి సాయిరెడ్డి వెంకటరెడ్డి



**కల్వకుర్తి రూరల్, జూన్ 10 (జనంసాక్షి) :** న్యూస్ కల్వకుర్తి డిఎస్పివెంకట్ రెడ్డిప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని గ్రామస్తులకు రోడ్డు భద్రతమాదకద్రవ్యాలపైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి సీఐ నాగార్జున,ఎస్ఐ కురుమూర్తి,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీడీవో గాలి యాదయ్య గ్రామ సర్పంచు,ఉప సర్పంచ్ వార్డు మెంబర్స్ గ్రామ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు సేఫ్టీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**మెమిన్‌పేట, జూన్ 10 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత నియమ నిబంధనలు అందరూ తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాద నివారిణి లక్ష్యం రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, ఐజి షా నవాజ్ ఖాసీం అన్నారు. మోమిన్ పేట మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్, అలైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి 120 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా తమ గమ్యానికి చేరుకోవాలని, అలాగే మద్యం సేవించి, ఫోన్లో మాట్లాడుతూ వాహనాలను నడప రాదని, తమ పైన తమ కుటుంబం ఆధారపడి ఉందని గ్రహించాలన్నారు. తమ సేఫ్టీ కోసమే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు, నేరాలను అదుపు చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు పోలీస్ స్టేషన్లో 120 సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా నేరాలను అదుపు చేయడం జరుగుతుందని, అలాగే నేరస్తులను సులువుగా పట్టుకోవచ్చు అన్నారు శాంతిభద్రతలను కాపాడుకోవడంతోపాటు నేర రహిత సమాజాన్ని స్థాపించ వచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మేహెరా, డి.ఎస్.పి అంజయ్య, తహసిల్దార్ రవీందర్, సిఐ,జి వెంకట్, ఎస్సై భరత్ భూషణ్, ఆర్ ఐ గోవర్ధన్, సర్పంచుల సంఘం అధ్యక్షులు కోస్గి సురేందర్, సర్పంచులు కృష్ణవేణి, లావణ్య అశోక్ , బాలరాజ్ గౌడ్, మోహన్, ఆయా గ్రామాల సర్పంచులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్య కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి



**శామీర్‌పేట్, జూన్ 10 (జనం సాక్షి) :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీ లకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు జి.సునీత డిమాండ్ చేశారు. బుధవారం రోజు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్ ను మరియు పిఎం శ్రీ విద్యను ప్రవేశపెడు తున్నారని అన్నారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పి.ఎం.శ్రీ విద్యను గ్రామములో అమలు చేయమని వాటిని అంగన్ వాడీలకు అప్పజెప్పాలని కోరుతూ తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వంకు పంపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం దారుణమని విమర్శించారు. ప్రీ ప్రైమరీ మరియు పీఎం శ్రీ కేంద్రాలను అంగనవాడిలకే అప్పచెప్పు తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని డిమాండ్ చేశారు. 30 నుండి 40 సంవత్సరాలగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లకు మరియు హెల్పర్లకు ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలతో వారి ఉద్యోగాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ప్రమాదంగా మారిన ప్రీ ప్రైమరీ ,పి.ఎం.శ్రీ 4,131 కేంద్రాలను వెంటనే రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు అనిత, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి జనాభా గణన దోహదపడుతుంది

- అదనపు కలెక్టర్ నర్సింగరావు



**మల్దకల్, జూన్ 10 (జనంసాక్షి) :** జనాభా గణన దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, ప్రస్తుతం ఇండ్ల గణన చేపట్టినట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మల్దకల్ మండలం నేతివానిపల్లె గ్రామంలోజరిగిన ప్రత్యేక గ్రామ సభకు అదనపు కలెక్టర్ హాజరై ప్రసంగించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా నాలుగు రకాల వ్యర్థల విభజన గురించి వివరించారు. వ్యవసాయ,ఉద్యానవన శాఖల పథకాల గురించి రైతులకు కూలంకషంగా తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల సహకారం అందిస్తుందన్నారు. వర్షకాలంలో మంచినీటి నిర్వహణ గురించి వివరించి, వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంతో ఉపాధి లేని వారికి పని దినాలు కల్పించి కూలీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జయశంకర్ బడిబాట పెద్దఎత్తున ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యలతోపాటు ఇతర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించడంలో తన శాయశక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసభ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, సర్పంచ్ పద్మ, ఉపసర్పంచ్ మునినాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్,వార్డు సభ్యులు, వివిధ శాఖల నుంచి అధికారులు, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.


## విబి గ్రాంజీ చట్టాన్ని అమలు చేయొద్దు

**ముషీరాబాద్, జూన్ 10 (జనం సాక్షి) :** కూలీల పని హక్కులను కాలరాసే విబి గ్రామజీ చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కొత్త చట్టాన్ని రూపొందించి, ఉపాధి కూలీల హక్కులను పరిరక్షించాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం సేవ్ నరేగా తెలంగాణ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వి బి గ్రామ్ జీ చట్టాన్ని ఉప సంహరించుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని బ్యాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో విశ్రాంత ఐఏఎస్, విద్యా కమిషన్ మాజీ చైర్మన్, ఉపాధి హామీ పథకం మాజీ డైరెక్టర్ ఆకునూరు మురళి మాట్లాడుతూ బిజెపి ఆర్ఎస్ఎస్ లు పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే సంక్షేమ పథకాలను అమలు చేయడం సైతం జీర్ణించులేకపోతున్నారని అన్నారు. పేద ప్రజల చట్టాలను పథకాలను అరిస్తున్న బిజెపి ఆర్ఎస్ఎస్ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. డి బిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ వి బి గ్రామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానానికి రాష్ట్ర



ప్రభుత్వం కట్టుబడి ఉంటూ తెలంగాణలో వి బీ గ్రామ్ జి చట్టాన్ని అమలు చేయద్దని డిమాండ్ చేశారు. విబి గ్రామజీ చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని సదస్సు తీర్మానించింది. ఈ సమావేశంలో పీపుల్స్ మానిటరింగ్ రాష్ట్ర కన్వీనర్ శివలింగం, టీవీ వియు నాయకులు నర్సింలు, పద్మ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకురాలు మీరా సంఘమిత్ర, సామాజిక కార్యకర్తలు డాక్టర్ ఉషా సీత లక్ష్మి,అఖిల్ సూర్య ,రైతు స్వరాజ వేదిక నాయకులు కన్నెగంటి రవి, హర్ష, కొండల్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు దుబాయ్ సంజీవ్, కల్పన, రాజేందర్, కిసాన్ మిత్ర కార్యకర్తలు రమాకాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీతోనే దేశాభివృద్ధి సాధ్యం



**చేవెళ్ల, జూన్ 10 (జనంసాక్షి) :** దేశఅభివృద్ధి నరేంద్రమోడీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వైభవ్రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రధానిగా 12 సం వత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం బీజేపీ నాయకులు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో గత 12 సంవత్సరాలు వరుసగా బీజేపీ పార్టీ అదినేత నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా దేశ అభివృద్ధికి భాటలు వేయడం అభినందనీయమన్నారు. దేశానికి 4399 రోజులుగా అంకితభావంతో నరేంద్రమోడి పని చేస్తున్నాడని చెప్పారు. ప్రపం చవ్యాప్తంగా దేశానికి మరింత గుర్తింపు తెచ్చాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్, మనిషారెడ్డి, కరుకే మీనాక్షీ సత్యనారాయణ, నాయకులు అంజనేయులు, దేవుని శర్వలింగం, కృష్ణగౌడ్, వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు ప్రశాంతంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం

- డీఎస్పీ లింగయ్య

**నారాయణపేట, జూన్ 10 (జనం సాక్షి) :** గ్రామాలు ప్రశాంతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అని నారాయణపేట డీఎస్పీ. ఎన్.లింగయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణపేట మండలం సింగారం గ్రామంలోని మహి ళా సమైక్య భవనంలో నిర్వ హించిన గ్రామసభకు డీఎస్పీ నల్లపు లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై అరయవ్,ఆలలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, మహి ళల భద్రత, గ్రామ శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు సక్రమంగా ఉన్న పుడే ఆ గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామ ప్రజలందరూ పరస్పర సహకారంతో, చట్టా లను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిం చాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవ గాహన కల్పించిన ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, నారాయ ణపేట జిల్లాలో కూడా వంద కు పైగా ప్రాణనష్టాలు సంభ విస్తున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదా లను గణనీయంగా తగ్గించ వచ్చన్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్న డీఎస్పీ, అటువంటి ఘటనల్లో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్య తగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించేం దుకు త్వరలో "మన గ్రామం – మన పోలీస్" కార్య క్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారం భించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాల యాల వద్ద పోలీస్ వాల్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో గ్రామా నికి సంబంధించిన నేర సమాచారం, అత్యవసర పోలీసు ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల పెట్టె, క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ఫిర్యాదులు అందించే సౌకర్యం కల్పించనున్నట్లు వివ రించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు వాల్‌ను డీఎస్పీ నల్లపు లింగయ్య, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీని వాస్‌తో కలిసి పరిశీలించా రు. మత్తు పదార్థాల నిర్మూ లనపై మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు సమాజాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవ రైనా గంజాయి మొక్కలు పెంచినా లేదా మత్తు పదార్థాల వ్యాపారంలో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అలాంటి వ్యక్తు లకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిపివేయబడే అవకాశం ఉందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, అభివృ ద్ధి వైపు దృష్టి సారించాలని సూచించారు. మహిళల భద్ర తకు ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డీఎస్పీ పేర్కొ న్నారు. మహిళలు, బాలి కలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లపై లైంగిక వేధింపులు లేదా అత్యాచారాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇలాం టి ఘటనలను



దాచిపె ట్టేందుకు లేదా రాజీ చేసేం దుకు ప్రయత్నించే వారిపైనా చట్టపరమైన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాల ని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఉచిత సీటు సాధిం చిన విద్యార్థిని కళ్యాణిని, ఆమె తల్లిదండ్రులు అంశా వతి, కుమార్లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలోని విద్యార్థులంద రూ ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా సమైక్య భవనం ఆవరణలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచే బాధ్యత గ్రామ ప్రజలందరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, మహిళా సమైక్య సంఘం సభ్యులు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
11 జూన్ 2026

# పంటల మార్పిడితోనే రైతులకు ప్రయోజనం

- వరి ధాన్యం నిలువలతో ఇబ్బందులు
- ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్య
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**పెబ్బేరు, జూన్ 10 (జనం సాక్షి) :** మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ, పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో వార్డు సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. ఈ గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, పెబ్బేరు వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి, ఎంపీఓ, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

## మల్లిఖార్జున ఖర్గేను కలిసిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, జూన్ 10 (జనంసాక్షి) :** ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ని ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన సందర్భంగా తన రాజకీయ గురువు అయిన మల్లిఖార్జున ఖర్గే ని ప్రత్యేకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు గా మల్లిఖార్జున ఖర్గే, లోక్ సభ లో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇటీవల కేరళం రాష్ట్రం లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా వారి దీర్ఘకాల సేవలను కొనియాడారు. రాబోయే రోజుల్లో ఖర్గే, రాహుల్ గాంధీ ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని ఘన విజయాలు సాధించాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్




**మెదక్, సంగారెడ్డి టౌన్, జూన్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులు కేటాయించామని చెప్పారు.

# జిల్లాలో నీట్ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి, టౌన్ జూన్ 10 (జనం సాక్షి) :** జిల్లాలో నిర్వహించనున్న నీట్ పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు ఆదేశించారు. జూన్ 21న మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,924 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్-144 అమలు చేయడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు.




అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల పనితీరు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, ఫర్నిచర్, లైటింగ్ తదితర ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష నిర్వహించే రోజు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నీట్ వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ స్థాయి పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు సంబంధించిన మార్గదర్శకాలను పూర్తిగా చదివి, హాల్ టికెట్‌లో పేర్కొన్న సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అమలులో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిషేధిత వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారి (ఎన్‌టిఏ) భారతీదేవి , జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, ఆర్టీసీ, విద్యుత్, పోస్టల్ , రెవెన్యూ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో యాక్సిడెంట్లతో సంవత్సరానికి 7 వేల మంది మృతి

- రాష్ట్ర అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్



**వెల్దుర్తి, జూన్ 10 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నమై రోడ్ల పడుతున్నాయని రాష్ట్ర పోలీస్ శాఖ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ తెలిపారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా జరిగిన అరేయ్ అలవ్ గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అరేయ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలని పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుందని, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అన్నారు గతంలోజరిగిన కార్గిల్ యుద్ధంలో 600 మంది మృతి చెందారని ఇటీవల జరుగుతున్న ఇజ్రాయిల్ ఇరాన్ అమెరికా యుద్ధంలో 3 వేల ఆరు మంది చనిపోయారని కానీ రోడ్డు ప్రమాదంలో దేశవ్యాప్తంగా సంవత్సరానికి లక్ష మంది చనిపోతున్నారని ఆయన అన్నారు. దేశంలో యుద్ధం కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదంలో ప్రాణం నష్టం జరుగుతుందని ఏడిజిపి తెలిపారు. జిల్లాకలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ అజ్జాగ్రత్త నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ప్రయాణంలో సురక్షితంగా గమ్యం చేయడం కోసం ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం ముఖ్యమని కానీ సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతురన్నారని, జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు అతివేగం అజాగ్రత్త హెల్మెట్లు సీటు బెల్టులు పెట్టుకోకపోవడం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదుల కారణమన్నారు. మాసాయిపేట సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తమకు గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఏర్పాటు చేయాలని అలాగే శానిటేషన్ ఆరోగ్య సిబ్బంది నియమించాలని అధికారులకు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ,తూప్రాన్ ఆర్డీవో బావయ్య పాల్గొన్నారు.

## వ్యవసాయ విస్తరణ అధికారిని నిలదీసిన రైతులు



**వీపనగండ్ల, జూన్ 11 (జనంసాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభకు గ్రామ సర్పంచ్ ముంత జ్యోతి బిచ్చన్న యాదవ్ అధ్యక్షులు వహించారు.గ్రామసభ లో వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్ మాట్లాడుతున్న సందర్భంలో రైతులు రైస్ మిల్లర్లు వరి ధాన్యం అన్లోడింగ్ చేయకపోవడంతో వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఐకెపి, మహిళా సంఘం, అధికారులు పట్టించుకోవడంలేదని నిలదీశారు. పండించిన పంటకు అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం జరుగుతుందని, రైస్ మిల్లర్లు క్వింటాలుకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీయడం జరుగుతుందని అన్నారు.తరుగు ఇచ్చిన రైతుల మాత్రమే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని నిలదీశారు.తహా సిల్దార్ కొనుగోలు,అన్లోడింగ్ పై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు గ్రామసభ నిర్వహించవద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పొలాలకు భూసార పరీక్షలు చేయడం లేదని, భూమిలో ఏ పోషకాలు తక్కువ ఉన్నాయి వాటికి సంబంధించిన అవగాహన కల్పించడం లేదని, గ్రామానికి విధులకు వ్యవసాయ అధికారులు వారంలో ఎన్ని రోజులు వస్తారో అధికారులు తేదీలను ప్రకటించాలని పట్టు పట్టారు. గ్రామంలో ఇంకా ఆరు లారీల వరి ధాన్యం తరలించాల్సి ఉన్న, లారీల కొరతతో తరలించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి



**తెలకపల్లి, జూన్ 10 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి నివేదిక2026 లో భాగంగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆధ్వర్యంలో పార్లమెంటు స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార బస్సుయాత్రలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్ కు చేరుకున్న బస్సుయాత్ర లో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ప్రజల కు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తున్నదని అన్నారు.పేదలకు సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, 500 కే సిలిండర్, నిరుద్యోగులకు 75 వేల ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు, మహిళా శక్తి క్యాంటీన్లు మహిళలకు వడ్డీ లేని రుణాలు, విద్యాభివృద్ధి కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మొదలగు సంక్షేమ ఫలాలను అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి అర్హుడికి వాటి ఫలాలు అందేలా చూసే బాధ్యత ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తపై ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, తెలకపల్లి సర్పంచ్ చంద్రశేఖర్ ,ఉప సర్పంచ్ వారణాసి శ్రీనివాసులు , సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ మామిళ్ళపల్లి యాదయ్య, వార్డు సభ్యులు మెంబర్లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళలు, యువత, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సెర్ప్ పారా మీటర్లను మెరుగుపరచాలి

- కలెక్టర్ సీహెచ్. ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 10 (జనం సాక్షి) :** సెర్ప్ పారా మీటర్లను మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్త్రీనిధి సమీక్షా కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, నిరర్థక ఆస్తుల రికవరీపై ఎస్ఎన్ఆర్సి కమిటీ సభ్యులు, డిపిఎంలు, ఎపిఎంలు, సిసిలు, జెడ్ఎంఎస్ ఓబిలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూనిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సిసిలందరికీ సూచించారు. అలాగే గ్రూప్ యూనిట్లను గుర్తించాలని, ఇప్పటికే జిల్లాకు షీ మార్ట్ మంజూరు చేయబడిందని తెలిపారు.అన్ని సెర్ప్ పారామీటర్లను మెరుగుపరచాలని ఆదేశించారు. జిల్లా లో ఏర్పాటు చేసిన కిషోర బాలికల సంఘాలలో ప్రతిభ కలిగిన అమ్మాయిలను ఎంపిక చేసి ఫోటో గ్రఫి, కంప్యూటర్ శిక్షణ కోసం హైదరాబాద్ పంపించేలా చూడాలని డిఆర్డీఏ వెంకట్ రాములు కు సూచించారు. జిల్లాకు హ్యాండ్ లూమ్ టెక్స్ టైల్ కూడా రాబోతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాకు మంజూరైన షీ మార్ట్ లో ఏ ఏ ఉత్పత్తులు పెట్టాలో జాబితా తయారు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని వెజ్ నాన్ వెజ్ మార్కెట్ లో వారానికి ఒక రోజు (శుక్రవారం) మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. అలాగే మండలాల వారీగా స్కూల్ యూనిఫాం కోసం వచ్చిన బల్క్ క్లాత్ ను వెంటనే పంపించి, స్టిచ్చింగ్ బాధ్యత ను ఏపీఎం లు, సీసీ లు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. మండలానికి ఒక మాస్టర్ ట్రైనర్ ఉంటారని, యూనిఫాం కొలతల హెచ్చు తగ్గులను ఆయన సరి చేస్తారని, పాఠశాలల హెచ్ ఎం, ఉపాధ్యాయుల తో సమన్వయం చేసుకుని యూనిఫాం లను పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావే శంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీపిఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఓబీలు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనలో కష్టజీవుల బతుకు అధోగతి

**వనపర్తి రూరల్, జూన్ 10 (జనం సాక్షి) :** బిజెపి 12 ఏళ్ల పాలనలో దేశం పరిస్థితి, కష్టజీవుల బతుకు అధోగతి పాలైందని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెరిగిన ధరలకు నిరసనగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్ కార్యాలయాన్ని సిపిఐ నేతలు కార్యకర్తలు బుధవారం ముట్టడించారు. ధర్నా చౌక్ నుంచి నేతలు కార్యకర్తలు ఎర్రజెండాలు ఎర్ర షర్టులు ఎర్ర చీరలు ధరించి భారీ ర్యాలీగా కలెక్టర్ ఆఫీస్కు చేరుకున్నారు. ముట్టడి సందర్భంగా నేతలు కార్యకర్తలు గేట్లు తోసుకొని లోపలికి వెళ్లకుండా ప్రధాన గేటు వేసి అడ్డుకున్నారు. కార్యకర్తలు గేటు ముందు బైఠాయించి నిరసన కొనసాగించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసిన నచ్చజెప్పి తమ ప్రసంగాలను కొనసాగించారు. నరేంద్ర మోడీ 12 ఏళ్ల క్రితం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, స్విస్ బ్యాంకు నుంచు నల్లధనం తెచ్చి ప్రతి రైతు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని, ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పైగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను భారీగా పెంచాలని, ఫలితంగా రవాణా చార్జీలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు చుక్కలు అంటాయని అన్నారు. సామాన్యుడు నిత్యవసర వస్తువులను కొని తినలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ధరలు తగ్గించాలని విపక్షాలు ప్రజలు గగ్గోలు పెడుతున్న పట్టించుకోవడం లేదని ధరలు తగ్గించే దాకా పోరాటం చేస్తామన్నారు. ధరల పెంపుతో సామాన్యుల కష్టాన్ని దోచి సంపన్నులకు సంపద పెంచుతున్నారని, కార్మిక చట్టాలను కాలరాచారని, వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి రైతుల కడుపు కొట్టేందుకు పూనుకున్నారని విమర్శించారు. రైతులు ఏడాది పోరాటంతో తోకమడిచి నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నారన్నారు. ప్రజల కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు పొదుపు పాటించాలని చెబుతున్న నరేంద్ర మోడీ రోజుకో దేశం తిరుగుతూ ప్రజల సొమ్ము దుర్వినియోగం, నీళ్లలా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. దేశ సార్వభౌమత్వానికి చేటు తెచ్చే విధంగా ట్రంప్ కు భయపడుతున్నారు అని అన్నారు. తక్కువ ధరకు రష్యా చమురు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న కొనవద్దని మోడీకి ట్రంప్ హుకుం జారీ చేస్తున్న బెదిరించలేని అసహాయ స్థితిలో మోడీ ఉన్నారన్నారు. దేశభక్తి హిందూ మతం ముసుగులో ఇచ్చిన హామీల నుంచి ప్రజల సమస్యల నుంచి దృష్టి మరలచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలకు కనీస ఓటు హక్కును కూడా సర్ పేరుతో కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు గమనించి ప్రతిఘటించి బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా నేతలు కళావతమ్మ, చంద్రయ్య, కృష్ణవేణి, గీత, మోష అబ్రహం, రాబర్ట్, శ్రీహరి, పృథ్వీ నాదం, భాస్కర్, రవీందర్, డంగు కుర్మయ్య, వంక గోపాల్, గోపాలకృష్ణ, జయమ్మ, శ్రీదేవి, కురువమ్మ, డంగ్గులక్ష్మి, శిరీష, ఎం.కురుమయ్య, పెంటయ్య, చిన్న నారాయణ, శివకుమార్, కాకం బాలస్వామి, లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్, సహదేవుడు, కాశన్న, మహేష్, వెంకటమ్మ, శంకరమ్మ, కుతుబ్, వంశీ, ఎర్ర కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## వరదలకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ టౌన్, జూన్10 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలో వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో గతంలో వర్షాలు కురిసి నీటిమయమైన శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా, విశ్వనాథ్ పేట్, సిద్దాపూర్ వాగు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో పట్టణంలో ఎక్కడ కూడా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు వర్షాకాలం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రజలకు వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. డ్రైనేజీలు, నాళాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూడికలు తీసివేస్తూ నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట మార్పిడికి సహకరించాలి

- పరిశుభ్రత, మహిళల ఆరోగ్యం పై అవగాహన ఉండాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- బండవుతాపురంలో గ్రామసభ




**వరంగల్ బ్యూరో, జూన్ 10 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వర్దన్నపేట మండలం బండౌతాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన కలెక్టర్, రసాయన ఎరువుల వినియోగం, గ్రామ పరిశుభ్రత, మహిళల ఆరోగ్యం, బాలికల విద్య, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రుతుపవనాల రాక ఆలస్యం కావచ్చనే అంచనాల నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి సహకరించాలని కోరారు.వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ, గతంలో రైతులు అనుసరించిన సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల జొన్నలు, మినుములు, పత్తి, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండటంతో పాటు నేల సారవంతతకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయని చెప్పారు. అలాంటి చర్యలకు పాల్పడితే జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. అధిక రసాయనాలు కలిగిన ఎరువులను ఇళ్లలో ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని, వాటి నుంచి వెలువడే రసాయనాలు ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. ఎరువులు వినియోగించే సమయంలో మాస్క్, గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చిన కలెక్టర్, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందన్నారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా నిరోధించి డయేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ పర్యావరణహిత సానిటరీ ప్యాడ్స్ వినియోగించాలని సూచించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా సమాజ పురోగతికి దోహదపడాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ గ్రామ సభ లో గ్రామ సర్పంచ్ దశరథం, జడ్పి సీఈఓ రామ్ రెడ్డి, ఎమ్మార్వో విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి పార్టీలను పక్కకు పెట్టాలి

- గ్రామ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని గ్రామ అభివృద్ధిపై చర్చించాలి
- కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి




**కమలాపూర్, జూన్ 10 (జనంసాక్షి) :** భారతదేశంలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో మొదటి మెట్టు గ్రామ సభ నేనని కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామ సభలో పార్టీలను, కుల మతాలను పక్కన పెట్టి గ్రామంలో అభివృద్ధి ఎం జరిగింది ఇంకా ఎం అభివృద్ధి చేయాలి అనే దాని పై సుదీర్ఘంగా చర్చించి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామానికి వచ్చిన నిధులు ఎంత గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు ఏంటి అని గుర్తించి వచ్చిన నిధులను ఎలా ఖర్చు చేయాలనే అవగాహనకు రావాలన్నారు. గ్రామ సభలో ప్రతి ఒక్కరు వారి వారి అభిప్రాయాలను తెలియజేస్తారని వాటన్నింటినీ రికార్డ్ బుక్ లో రాసుకుని ప్రాధాన్యత పరంగా ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరించుకుంటూ వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను గ్రామ ప్రథమ పౌరుడు అయిన సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అర్హులైన వారికి అందేలా కృషి చేయాలన్నారు. 5 ఏండ్లు గ్రామ ప్రజా ప్రతినిధిగా మనకు ప్రజలు అవకాశం ఇచ్చినప్పుడు వారి సమస్యలు పరిష్కసారించుకుంటూ ప్రజల గుండెల్లో గూడు కట్టుకోవాలని అన్నారు. చదువు ద్వారా ఉద్యోగాలు సంపాదించవచ్చు కానీ మనిషి మనసును సంపాదించలేమని, ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ గా, ఎంపీటీసీ గా,వార్డు సభ్యుడుగా పోటీ చేసి ప్రజల మనుసును ఓటు రూపంలో మన వైపు మరల్చడం అత్యంత క్లిష్టమైన పని అని అన్నారు. గ్రామానికి సేవ చేయడానికి దేవుడు మనకు ఇచ్చిన గొప్ప అవకాశం ప్రజా ప్రతినిధి అవడం అని అలాంటి అవకాశాన్ని గొప్పగా సధ్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమం లో సీఐ నవీన్,గ్రామ సర్పంచ్ రాజు పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గౌడ సోదరుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ప్రమాదల నివారణ కోసమే కాటమయ్య రక్షణ కిట్ల పంపిణి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 10 (జనంసాక్షి) :** గౌడ సోదరుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రమాదకరమైన వృత్తిలో ఉన్న గౌడ సోదరులకు భద్రత కల్పించాలనే ఉదేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు శిక్షణ ఇచ్చి కాటమయ్య రక్షణకిట్లను ఉచితంగా పంపిణిచేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన్ పూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కిట్ల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్బంగా జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు సంబదించిన 678 మంది గౌడ సోదరులకు కాటమయ్య రక్షణ కిట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గౌడ సోదరులు ప్రమాదాలకు గురికాకుండా వారికి భద్రత కల్పించాలనే లక్ష్యంతో బిసి సంక్షేమ శాఖ, ఏక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికులకు శిక్షణ ఇచ్చి ఉచితంగా కాటమయ్య రక్షణ కిట్లను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. 10 వేల రూపాయ ల విలువ చేసే ఈ రక్షణ కిట్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణపొంది రక్షణ కిట్లుతీసుకున్న గౌడ సోదరులు వాటిని పక్కనపెట్టకుండ తప్పకుండా ఉపయోగించాలని సూచించారు. గ్రామాలలో కుల సంఘాల ఆధ్వర్యంలో రక్షణ కిట్లను ఉపయోగించే విధంగా చూడాలని అలాగే ఏక్సైజ్ శాఖ వారు పంపిణి చేసిన రక్షణ కిట్లు ఉపయోగిస్తున్నారో లేదో అని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధ పడడంకంటే ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మొత్తం 1679 కాటమయ్య రక్షణకిట్లు మంజూరు అయ్యాయని, పంపిణి చేసుకుంటున్న 678 తో కలుపుకొ ని ఇప్పటి వరకు 1558 రక్షణ కిట్లను పంపిణి చేసుకున్నామని తెలిపారు. ప్రమాదా నికి గురైన కుటుంబాలకు ప్రభుత్వం 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి, డిబీసిడీఓ ఎన్ ఎల్ నర్సింహారావు, ఏక్సైజ్ శాఖ సూపరిండెంట్ ఆర్ ప్రవీణ్, ఏక్సైజ్ సీఐ బాస్కర్ రావు, ఏక్సైజ్ ఎస్ఐ నరేష్ ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైలులోనే మహిళ ప్రసవం

- ఆడబిడ్డకు జననం



**వరంగల్ ఈస్ట్, జూన్ 10 (జనంసాక్షి) :** బీహార్‌కు చెందిన ఆర అంజుం (27) గర్భిణీగా కుటుంబ కార్యక్రమానికి హాజరై బెంగళూరు నుంచి తిరుగు ప్రయాణం చేస్తుండగా బుధవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. నాలుగో కాన్పు కావడంతో ప్రయాణ సమయంలోనే పురిటి నొప్పులు తీవ్రంగా రావడంతో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద రైలును నిలిపివేశారు. .తక్షణమే 108 ఎమర్జెన్సీ సర్వీస్‌కు సమాచారం అందించగా, ఈఎంటి కె. నాగరాజు, పైలట్ పి. అమర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. వారి సాయంతో ట్రైన్‌లోనే సురక్షితంగా ప్రసవం జరగగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.ఈ సమయంలో ట్రైన్‌లో ఉన్న ప్రయాణికులు 108 సిబ్బంది వేగవంతమైన స్పందనను ప్రశంసించారు. అనంతరం తల్లి, బిడ్డను మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.

## నేరాల నియంత్రణపై ఫోకస్ పెట్టాలి



- సీసీ కెమెరాల విస్తరణ జరగాలి
- సైబర్ నేరాలపై అవగాహనకు పెంచాలి
- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరపాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ సంకీర్త్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్రమైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, వివరాలను నిరంతరం అప్డేట్ చేయాలని, వ్యవస్థలోని అన్ని ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత పెంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి రవాణా, మట్కా జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలు, పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- బసవరాజుపల్లిలో నూతన పంచాయతీ భవనం ప్రారంభం
- గణపసముద్రంను టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీఎస్ఆర్ పర్యటించారు. గణపురం మండలంలోని బసవరాజుపల్లి, గణపురం, చెల్పూర్ గ్రామాల్లో గ్రామ సభలు, భూపాలపల్లి మున్సిపాలిటీలోని 2, 15వ వార్డుల సంయుక్త వార్డు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బసవరాజుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు కీలకమని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గణపురం మండలంలోని గణపసముద్రంను టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలోని ఫకీర్‌గడ్డ హనుమాన్ టెంపుల్ ప్రాంగణంలో 2, 15వ వార్డుల సంయుక్త వార్డు సభలో పాల్గొన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు సూచించిన పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ, గృహజ్యోతి, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తు సాగుకు సన్నద్ధం!

- పత్తి విత్తనాలను విత్తించిన రైతన్నలు



**చెన్నారావుపేట, జూన్ 10 (జనంసాక్షి) :** గ్రామాల్లోని రైతన్నలు ముందస్తు సాగుకు సన్నద్ధమయ్యారు. గత కొద్ది రోజులుగా తమ వ్యవసాయ భూములను ట్రాక్టర్లు, జోడెడ్లతో ముందస్తుగా దున్నించి పత్తి విత్తనాలు విత్తడానికి అచ్చులు వేయించుకున్నారు. అడపదడపా చిరుజల్లులు కురియడంతో బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో రైతులు కూలీలతో పత్తి విత్తనాలను నాటించారు. మరి కొంతమంది రైతులు తమ వ్యవసాయ భూముల్లో మొక్కజొన్న, వేరుశనగ పంటలను వేశారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10(జనంసాక్షి) :** అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టులు వినియోగించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిలో యువత అధికంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్‌లో వాహనం నడపడం వంటి నిర్లక్ష్య చర్యల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. అనంతరం జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన దృశ్యాలను విద్యార్థులకు స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, విద్యార్థులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియదర్శిని, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెడికల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకాంతంగా ఉన్న జంటలను బెదిరించి దోపిడీ

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- నగదు, ఉంగరాలు, మోటార్ సైకిల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిల్స్ కాలనీ పోలీసులు




**వరంగల్ బ్యూరో, జూన్ 10 (జనంసాక్షి) :** ఏకాంతంగా ఉన్న జంటను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి దోపిడీకి పాల్పడిన ముగ్గురు పాత నేరస్థుల అరెస్ట్ – నగదు, ఉంగరాలు, మోటార్ సైకిల్ స్వాధీనం. నిర్మానుష్య ప్రదేశంలో ఏకాంతంగా ఉన్న ఒక యువతీ యువకులను ఫోటోలు, వీడియోల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి, బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి వద్ద నుండి బంగారు, వెండి ఉంగరాలను బలవంతంగా లాక్కొని, యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు నిందితులను మిల్స్ కాలనీ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి ఒక బంగారు ఉంగరం, ఒక వెండి ఉంగరం, మూడు సెల్‌ఫోన్లు మరియు నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కాజీపేట వైఎస్ఆర్ నగర్‌కు చెందిన చెందిన బౌరి పవన్ సింగ్ (21), బౌరి రవీందర్ సింగ్ అలియాస్ రవి (21), బావురి సికెందర్ సింగ్ (26) ఈనెల 7న మద్యం సేవించడానికి డబ్బులు లేకపోవడంతో, నిర్మానుష్య ప్రదేశాల్లో వెళ్లే వారిని బెదిరించి డబ్బులు గుంజుకోవాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో ముగ్గురూ కలిసి సికెందర్ యొక్క పల్సర్ మోటార్ సైకిల్‌పై ఉర్సుగుట్ట – బట్టుపల్లి రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో వేచి చూస్తున్నారు.ఆ సమయంలో ఒక యువకుడు, యువతి మోటార్ సైకిల్‌పై వచ్చి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఒక వెంచర్‌లోకి వెళ్లడాన్ని నిందితులు గమనించారు. వారు లోపలికి వెళ్లిన కొద్దిసేపటికి నిందితులు ముగ్గురూ అక్కడికి చేరుకొని, ఏకాంతంగా ఉన్న ఆ జంటను చుట్టుముట్టారు. తమ సెల్‌ఫోన్లతో వారి ఫోటోలు, వీడియోలు తీసి... "ఈ వీడియోలను మీ తల్లిదండ్రులకు పంపుతాం, మీడియాలో పెడతాం" అని తీవ్రంగా బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు.బాధితులు తమ వద్ద నగదు లేదని చెప్పగా, నిందితులు ఆ యువకుడిని చేతులతో విచక్షణారహితంగా కొట్టారు. బాధితుడు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపుతానని బ్రతిమిలాడినప్పటికీ, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకుంటే పోలీసులకు దొరికిపోతామని భావించిన నిందితులు దానికి నిరాకరించారు.ఆ తర్వాత నిందితుడు పవన్ సింగ్ సదరు యువతి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని బలవంతంగా లాక్కోగా, రవీందర్ సింగ్ ఆ యువకుడి చేతికి ఉన్న వెండి ఉంగరాన్ని లాక్కున్నాడు. ఇదే క్రమంలో సికెందర్ సింగ్ యువతి పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించాడు. అనంతరం బాధితుల ముందే ఆ వీడియోలను డిలీట్ చేసినట్లు నటించి, అక్కడి నుండి పరారయ్యారు.

దోచుకున్న ఉంగరాలను కాజీపేటలో అమ్మితే పోలీసులకు దొరికిపోతామనే భయంతో, నిందితులు ముగ్గురూ వాటిని వరంగల్‌లో విక్రయించేందుకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై శ్రావణ్, హెడ్ కానిస్టేబుల్ నరేందర్, బీసీలు వాజీద్, ప్రవీణ్ రెడ్డి, హోంగార్డ్ నాగేశ్వరరావు పక్కా వ్యూహంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 10 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రజల నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని తాండూర్, నెన్నెల, మందమర్రి మండలాల తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి అధికారులతో సాదాబైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ సాదాబైనమా దరఖాస్తులను స్వీకరించి విచారణ చేపడుతున్నామని, ఈ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా విచారణ చేపట్టి పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాల్సిందే..!

- ఇంటి స్థలాల పాలసీని, హెల్త్ కార్డును ప్రకటించాలి
- ఈ నెలాఖరులో జిల్లా యూనియన్ మహాసభ
- టీయూడబ్ల్యూజే(ఐజేయు) తీర్మానం



**సంగారెడ్డి టౌన్, జూన్ 10 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా లో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు బాసిత్ అన్వర్ హుస్సేన్, యాదగిరి, భూమయ్య ఈ సమావేశానికి హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్ కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల జారీలో చాలా ఆలస్యం అవుతుందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయినప్పటికీ తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి అనేకసార్లు విన్నవించడం జరిగిందని చెప్పారు. దీని ఫలితంగానే అనేక సవరణలు వచ్చాయని, దానివల్లనే చాలామందికి అక్రిడేషన్ కార్డులు జారీ అయ్యాయని వివరించారు. మిగిలిన వారికి కూడా ఎలాంటి కొర్రీలు వేయకుండా తక్షణమే కార్డు మంజూరు చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. తమ సంఘానికి పోరాటం కొత్త కాదని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం గా టీయూడబ్ల్యూజే ఉన్నదని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమమే తమ సంఘం ధ్యేయమని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ నెలాఖరులో జిల్లా మహాసభను నిర్వహిస్తామని, జిల్లా కమిటీని ఎన్నుకుంటామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎకే ఫైసల్ తెలిపారు. యూనియన్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ సూచించారు. ఇతర ముఖ్య నేతలు అక్రమ్ పటేల్, మసూద్ ఖాన్, శ్రీనాథ్, బాసిత్, హాజీ, మినాజ్, సిద్దిక్, విష్ణు వర్ధన్, అబ్దుల్ మతిన్, విల్సన్, అంజయ్య, సంగమేశ్ వెంకటేష్ గౌడ్ సిద్దు, రమేష్ గౌడ్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



**పెద్దశంకరంపేట, జూన్ 10 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శంకరంపేట (అ) మండలంలోని బుజురాంపల్లి గ్రామంలో బుధవారం నాడు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో వర్షాకాల సన్నద్ధత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాలువల శుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం, జల సంరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను సమీక్షించారు. గ్రామ ప్రజల సమస్యలు, సూచనలు స్వీకరించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జైపాల్ గౌడ్, ఏపీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సంగమేశ్వర్, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మూలమాడ దళిత కుటుంబంపై దాడి అమానుషం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆగ్రహం
- సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి
- బాధితులకు అండగా ఉంటామని హామీ

**నవాబుపేట్, జూన్ 10 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మూలమాడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక దళిత కుటుంబంపై జరిగిన దాడిపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన మూలమాడ గ్రామాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. స్థానిక సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డి గ్రామంలో అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ కాలనీపై పక్కా ప్రణాళికతో దాడికి తెగబడిన నరేందర్ రెడ్డిపై తక్షణమే రౌడీ షీట్ ఓపెన్ చేయాలని జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. గతంలోనూ సదరు వ్యక్తిపై అట్రాసిటీ కేసులు ఉన్నాయని, ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత స్థానిక ఎన్నికల్లో నరేందర్ రెడ్డికి వ్యతిరేకంగా దళిత వర్గానికి చెందిన అభ్యర్థి పోటీ చేశారనే కక్షతోనే, రాజకీయ కోణంలో ఈ దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించారు.



### బిఆర్ఎస్ నేతల తీరుపై ధ్వజం..

ఇదే సమయంలో గ్రామాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ల తీరును కాలే యాదయ్య తీవ్రంగా తప్పుబట్టారు. బాధితులను పరామర్శించి న్యాయం చేయాల్సింది పోయి, కేవలం నిందితుల వైపు ఉన్న వర్గాన్ని మాత్రమే కలిసి మాట్లాడటం వారి స్థాయిని దిగజార్చుకోవడమేనని విమర్శించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు తగిన న్యాయం చేయాలని స్థానిక పోలీస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, మల్ రెడ్డి, నాగిరెడ్డి, రావు గారి వెంకట్ రెడ్డి మహమ్మద్ రఫీ, ప్రభాకర్, కాందాడా నాగిరెడ్డి, నరసింహారెడ్డి, శివరాజ్,తో పాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**మాడుగులపల్లి, జూన్ 10 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం నడుం బిగించిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు బుధవారం ఆయన నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మండల కాంప్లెక్స్ భవన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని చెరువుపల్లి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ. 10 లక్షలతో నిర్మించిన గ్రామ సమాఖ్య భవనాన్ని మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా పురుషులతో సమానంగా ఎదిగేలా చూస్తామన్నారు అందుకోసం ప్రతి మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు మహిళా సంఘాల ప్రయాణ సౌకర్యాల కోసం ప్రతి మండలానికి ఒక బస్సు కేటాయించడంతో పాటు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని వివరించారు మహిళలందరూ స్వయం



సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, ఆర్ అండ్ బిఎస్ఈ శ్రీధర్ రెడ్డి, తాసిల్దార్ సరోజ పావని,ఎంపీడీవో వంశీధర్,మాజీ జెడ్పీటీసీ సైదులు, స్థానిక సర్పంచ్ సైదిరెడ్డి, అరూరి నరేష్, బెల్లీ జానయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి,తదితర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలు కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సాయం చేశారు చెరువుపల్లి గ్రామానికి సంబంధించిన వారికి మూడు లక్షలు, ఇందుగుల గ్రామానికి సంబంధించిన వారికి రెండు లక్షలు ఆర్థిక సాయం చేశారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- దేశ్‌ముఖి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన సభ
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జూన్ 10 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మార్గదర్శకత్వంలో పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో రోడ్డు భద్రత గ్రామసభ నిర్వహించారు. టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్త్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిలాషా బిస్త్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామసభలో ట్రాఫిక్ నిబంధనలు, పాదచారుల భద్రత, రోడ్డు సూచికల పాటింపు తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, గ్రామ సర్పంచ్ దుర్గం జంగయ్య, యువత, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి కరెస్పాండెంట్, జూన్ 10 (జనం సాక్షి) :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ రాబోవు వర్షాకాలం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు, చెరువులు, కాలువల పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు సరదాగా చెరువులు, కాలువల వద్దకు ఈతకు వెళ్లకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయాల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలు, రహదారుల మరమ్మతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, జనాభా సమీకరణ ప్రదేశాలలో తరచూ శానిటేషన్ నిర్వహించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వెయ్యాలని, డ్రైనేజ్‌లు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ,మిషన్ భగీరథ, తదితర ట్యాంకులను తరచూ శుభ్రపరచాలన్నారు. జూన్ 15 నుండి పాఠశాలలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా రెండు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని వాటర్ ట్యాంకులు, మరుగుదొడ్లు, క్లాస్ రూములు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఒక ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలలో ఉండే విధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు.

### ఫైళ్ల నిర్వహణ నిర్దేశించిన పద్ధతిలోనే నిర్వహించాలి

ఫైళ్ల నిర్వహణ నిర్దేశించిన పద్ధతిలోనే నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఇన్వార్డ్, అవుట్ వార్డ్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రతి శాఖలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ నుండి వచ్చే ఫైళ్లను లేదా హెడ్ ఆఫ్ ది



డిపార్ట్మెంట్‌కు పంపించే అన్ని ఫైళ్లను తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ ద్వారానే పంపించాలని స్పష్టం చేశారు.నిర్దేశించిన విధానాన్ని పాటించకుండా నేరుగా ఫైళ్లు పంపడం లేదా కలెక్టర్ కార్యాలయానికి పంపకుండా వ్యవహరించడం తీవ్రంగా పరిగణించబడుతుందని అన్నారు. ఇటువంటివి మరోసారి పునరావృతమైతే సంబంధిత శాఖ హెచ్ఓడీతో పాటు బాధ్యులైన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిపాలనా విధానాలను అన్ని శాఖల అధికారులు కచ్చితంగా పాటించాలని, ఫైళ్ల నిర్వహణలో సమన్వయం, పారదర్శకత మరియు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు ఈ విషయాన్ని గమనించి ఇకపై నిబంధనల మేరకు వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ,సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఇన్వార్డ్, అవుట్ వార్డ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 10 (జనం సాక్షి) :** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు.గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం



పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూలి ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ శిక్షణ

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 10 (జనంసాక్షి) :** కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను భవిష్యత్తు సాంకేతికత వైపు నడిపించేందుకు సూర్యాపేట జిల్లా అధికారులు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణ కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. మొదటి విడతగా జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో దీనిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్



సాధనాలను బాధ్యతాయుతంగా ఎలా వాడుకోవాలో నేర్పడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

### పైలెట్ ప్రాజెక్టుగా సూర్యాపేట..

ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారు.ఈ కార్యక్రమం విజయవంతమైతే,రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించడానికి ఇదొక రోల్ మోడల్‌గా నిలుస్తుందని విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, టీ ఫైబర్,సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




#### భారత్‌లో స్టార్‌లింక్‌కు అనుమతులు ఫ్రీజ్ వార్తలు..

## స్పందించిన మస్క్ సంస్థ

దేశంలో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు ఎలాన్ మస్క్ చేస్తోన్న ప్రయత్నాలకు షాక్ తగిలినట్లు సమాచారం. స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి అవసరమైన తుది క్లియరెన్స్‌పై నిర్ణయం తీసుకోకుండా భారత ప్రభుత్వం హోల్డ్‌లో ఉంచిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో స్టార్‌లింక్ నుంచి స్పందన వచ్చింది. భారత ప్రభుత్వంతో చర్చలు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించింది. "నిరాధారమైన కథనాలకు విరుద్ధంగా భారత ప్రభుత్వంతో చురుకైన చర్చలు జరుపుతున్నాం. మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. సేవలు అందించేందుకు అవసరమైన అన్ని నియంత్రణ, సమ్మతి ప్రక్రియల విషయంలో ప్రభుత్వంతో పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాం" అని స్టార్‌లింక్ బిజినెస్ ఆపరేషన్స్ వైస్‌ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తుది క్లియరెన్స్‌ను ప్రభుత్వం హోల్డ్‌లో ఉంచడం వెనక పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణం. ఇరాన్ నుంచి ఎలాంటి లైసెన్సులు పొందనప్పటికీ.. యుద్ధంలో స్టార్‌లింక్ టెర్మినళ్లను ఉపయోగించారంటూ కథనాలు వచ్చాయి. మరి అలాగే ఏదైనా విదేశీ ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు భారత భద్రతా అవసరాలకు అనుగుణంగా మస్క్ కంపెనీ నడుచుకోగలదా..? అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాన్ని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. గతంలో టెలికాం అధికారులకు స్టార్‌లింక్ భద్రతాపరమైన అంశాల గురించి వివరణ ఇచ్చింది. అయితే అధికారులు మాత్రం మరింత స్పష్టత ఇవ్వాలని, సంస్థ తీసుకుంటున్న చర్యల గురించి అడిగారు. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ అనుబంధ సంస్థ అయిన స్టార్‌లింక్ వివిధ దేశాల్లో ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తోంది. సుదూర భూస్థిర ఉపగ్రహాలపై ఆధారపడే సంప్రదాయ ఉపగ్రహ సేవల మాదిరిగా కాకుండా.. లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాల ద్వారా స్టార్ లింక్ ఈ సేవలను కల్పిస్తోంది. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ఉండే కక్ష్యలో స్టార్‌లింక్‌కు చెందిన 6,000 ఉపగ్రహాలు పరిభ్రమిస్తుంటాయి. భూమి నుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను ఆస్వాదించొచ్చు. మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలందించేందుకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుంది.




# ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అండతో ఉదయం లాభాల్లో రాణించిన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో ఆ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో సెన్సెక్స్ 64 పాయింట్లు లాభంతో ముగియగా.. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు మేర క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 73,988.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,918.76) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,613.01 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఆరంభ లాభాలను కోల్పోయి 73,983.18కి పరిమితమైంది. నిఫ్టీ 23,214.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు



నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు బ్యారెల్ ధర 91.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4167 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

ముంబయి: దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.4300 క్షీణించి రూ.1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ.10వేలు తగ్గి రూ.2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికితోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇఎడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.

## ఈక్విటీ ఓఈలో తగ్గిన పెట్టుబడులు.. గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచీ బయటకు!



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధుల ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మే నెలలో ఈ విభాగంలోకి రూ.22,908 కోట్ల నిధులు మాత్రమే వచ్చాయి. ఈ ఏడాదిలో ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.38,440 కోట్లు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రాగా.. ఆ నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 40 శాతం తగ్గుముఖం పట్టింది. గత కొన్ని రోజులుగా మార్కెట్ ఒడుదొడుకులకు లోనవుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా మే నెలకు సంబంధించిన గణాంకాలను బుధవారం విడుదల చేసింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు సంబంధించి ఏప్రిల్ నెలలో నికరంగా రూ.3.22 లక్షల కోట్లు పెట్టుబడులు రాగా.. మే నెలలో రూ.64,131 కోట్ల నిధులు తరలిపోయాయి. ముఖ్యంగా డెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీ నుంచి రూ.96,948 కోట్ల నిధులు తరలిపోవడం ఇందుకు ప్రధాన కారణం. ఈక్విటీ స్కీమ్స్ వారీగా చూసినప్పుడు.. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.5,175 కోట్లు నిధులు వచ్చాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,945 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,385 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.1,593 కోట్లు చొప్పున నిధులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ నుంచి మే నెలలో నిధులు తరలిపోయాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌కు సంబంధించి ఏప్రిల్ నెలలో రూ.3,040 కోట్లు నిధులు రాగా.. మే నెలలో రూ.725 కోట్లు తరలిపోయాయి. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ వద్ద నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ అంతకుముందు నెలతో పోల్చినప్పుడు రూ.81.92 లక్షల కోట్ల నుంచి మే నెలలో రూ.81.6 లక్షల కోట్లకు తగ్గినట్లు యాంఫీ వెల్లడించింది.

## మిడ్‌రేంజ్ యూజర్ల కోసం రియల్‌మీ నుంచి కొత్త ఫోన్

ఒప్పో అనుబంధ సంస్థ రియల్‌మీ పీ4 సిరీస్‌లో మరో ఫోన్‌ను తీసుకొచ్చింది. పీ4ఆర్ 5జీ పేరిట దీన్ని విడుదల చేసింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ, 45వా ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో ఈ ఫోన్ వస్తోంది. రియల్‌మీ పీ4ఆర్ 5జీలో 6.8 అంగుళాల హెచ్‌డీ+ 144 హెర్ట్జ్ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 1200 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్‌కు సపోర్ట్




చేస్తుంది. డైమెన్‌సిటీ 6300 ప్రాసెసర్ ఇచ్చారు. వెనుకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ ఇచ్చారు. ముందు వైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన రియల్‌మీ యూఐ 7తో పనిచేస్తుంది. 2 ఏళ్లు ఓఎస్ అప్‌డేట్స్, 3 ఏళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఐపీ 65 రేటింగ్, ఏఐ పల్స్ లైట్, మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 8000 ఎంఏహెచ్ బ్యాటరీతో మూడు రోజుల పాటు ఫోన్ వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 45వా ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో పాటు 27వా రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఇక ధర విషయానికొస్తే.. ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.18,999గా నిర్ణయించారు. 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.20,999, 6జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.22,999గా కంపెనీ పేర్కొంది. కార్డు ఆఫర్‌తో రూ.2 వేలు డిస్కౌంట్ లభిస్తుంది. జూన్ 17 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సిల్వర్ గ్లేర్, టైటానియం గ్లేర్, లావెండర్ గ్లేర్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా స్టోర్‌లో కొనుగోలు చేయొచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,36,450 | ₹ 1,48,860 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

# పసిడి పెట్టుబడులపై ఆంక్షలు

- ఫండ్ సంస్థల నిర్ణయం
- ఒక పాన్‌పై నెలకు రూ.10 లక్షలకు అనుమతి



హైదరాబాద్: అంతర్జాతీయంగా, దేశీయంగా బంగారం ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో, పసిడి పథకాల్లోకి భారీ పెట్టుబడులపై దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు తాత్కాలిక ఆంక్షలు విధిస్తున్నాయి. నగదు నిర్వహణ, బంగారం కొనుగోళ్లలో ఎదురవుతున్న సవాళ్లు – ధరల్లో ఒడుదొడుకులే ఇందుకు కారణం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, టాటా మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏకమొత్తం పెట్టుబడులను తాత్కాలికంగా నియంత్రిస్తున్నట్లు ప్రకటించాయి. కోటక్ మహీంద్రా ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ కూడా ఇదే బాట పడతాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. నేరుగా పసిడి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడులు రూ.25 కోట్లకు మించితే తీసుకోవడం లేదు. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడులకూ పరిమితి విధించాయి. ఒక పాన్ కార్డుపై ఒక క్యాలెండర్ నెలలో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకే అనుమతిస్తున్నాయి. ఈ ఆంక్షలకు కారణాలివీ..

**కృత్రిమంగా ధర పెరగకూడదనే**

మ్యూచువల్ ఫండ్ నిబంధనల ప్రకారం.. గోల్డ్ ఈటీఎఫ్ లేదా గోల్డ్ ఫండ్ల ద్వారా సేకరించిన ప్రతి రూపాయికీ సమాన బంగారాన్ని (99.5 స్వచ్ఛతతో) ఫండ్ సంస్థలు కొనుగోలు చేసి, కస్టడీలో భద్రపరచాలి. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయుల వద్ద ఉన్నాయి కానీ హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. పసిడి దిగుమతి చేసుకునేందుకు డాలర్లు వెచ్చించాల్సి ఉన్నందున, బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని స్వయంగా ప్రధానే పిలుపు ఇచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో రూ.వందల కోట్లు పసిడి ఫండ్లలోకి వచ్చినా, అందుకు సరిపడా బంగారం వెంటనే కొనేందుకు మార్కెట్‌లో అందుబాటులో ఉండటం లేదు. ఈ సంస్థలు భారీగా కొనుగోలు చేస్తే, మార్కెట్‌లో బంగారం ధరలు కృత్రిమంగా పెరిగే అవకాశం ఉండటంతో ఫండ్ మేనేజర్లు అప్రమత్తమయ్యారు.

**నగదు నిర్వహణకు ఇబ్బంది లేకుండా**

మ్యూచువల్ ఫండ్లు ప్రధానంగా అవసరమైనప్పుడు నగదుగా మార్చుకునే సదుపాయాన్ని (లిక్విడిటీ) నమ్ముకుని పనిచేస్తాయి. ఇప్పుడు భారీగా పెట్టుబడులు వచ్చి, ఆ తర్వాత మార్కెట్ అస్థిరత వల్ల ఒకేసారి ఉపసంహరణలు (రిడెంప్షన్) వస్తే, ఫండ్ సంస్థలు ఇబ్బందుల్లో పడతాయి. అందుకే, 'లిక్విడిటీ' నిర్వహణలో భాగంగానే పలు సంస్థలు తాత్కాలిక ఆంక్షలను అమల్లోకి తెచ్చాయి.

**వ్యత్యాసం రాకుండా**

గోల్డ్ ఈటీఎఫ్‌ల ప్రధాన లక్ష్యం.. మార్కెట్లో బంగారం ధర పెరిగితే లేదా తగ్గితే.. అంతే శాతంలో ఈ ఫండ్ల విలువ (ఎన్ఏవీ) మారాలి. కానీ, భారీగా నగదు వచ్చి.. దానికి సరిపడా బంగారాన్ని వెంటనే కొనలేకపోతే.. ఆ డబ్బు ఫండ్ల వద్ద నగదు రూపంలో ఉండిపోతుంది. దీనివల్ల బంగారం ధరలకూ, ఈ ఫండ్ల ఎన్ఏవీలకూ మధ్య వ్యత్యాసం (ట్రాకింగ్ ఎర్రర్) వచ్చే ప్రమాదం ఉంది. ఇది ఫండ్ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

**లాభాల ఆశతో..**

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా చాలామంది మదుపరులు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని చూస్తున్నారు. బంగారం ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో, స్వల్ప కాలంలోనే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోను స్థిరంగా ఉంచుకునేందుకే ఇష్టపడతాయి. అతిగా, ఒక్కసారిగా వచ్చే నిధుల వల్ల ఫండ్ విలువ దెబ్బతినకుండా చూసేందుకు, నిలకడగా మదుపు చేసే చిన్న మదుపరులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఫండ్ సంస్థలు భావిస్తున్నాయి.

**రిటెయిల్ మదుపరులకు నష్టం లేదు**

మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్ణయం వల్ల సాధారణ, చిన్న మదుపరులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. గరిష్ఠంగా నెలకు రూ.10 లక్షల లోపు ఏకమొత్తం మదుపు చేసేవారికి అనుమతి ఉంటుంది. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులు (సిప్) చేస్తున్నవారికీ ఆటంకాలు ఏమీ లేవు. దీర్ఘకాలిక దృక్పథంతో బంగారంపై పెట్టుబడులు పెట్టేవారు యథావిధిగా కొనసాగించొచ్చని వ్యక్తిగత ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## గోల్డ్‌బాండ్లపై జాక్‌పాట్..

బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టినవారికి కాసుల వర్షం కురుస్తోంది. 2019-20 సిరీస్- ఎఎఎ సార్వభౌమ పసిడి బాండ్ల ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ తేదీని ఆర్‌బీఐ తాజాగా ప్రకటించింది దీంతో అప్పట్లో ఈ బాండ్లు కొన్నవారికి ఇప్పుడు ఏకంగా 307.87% లాభం రావడం విశేషం. 2019-20 సిరీస్-7 గోల్డ్ బాండ్లకు సంబంధించి తుది రిడెంప్షన్ తేదీని ఆర్‌బీఐ జూన్ 10గా ప్రకటించింది. 2019 డిసెంబర్ 10లో జారీ చేసిన బాండ్లకు ఇది వర్తిస్తుంది. 999 స్వచ్ఛత కలిగిన గ్రాము బంగారం ధరను రూ.15,275గా నిర్ణయించింది. నాటి గ్రాము బంగారం ధర రూ.3,745 ఉండగా.. ఈ లెక్కన పెట్టుబడిదారులు గ్రాము పసిడిపై 307.87% లాభాన్ని ఆర్జించారు. అంటే ఒక్కో గ్రాముపై రూ.11,530 లాభం వచ్చినట్టే. దీనికి ఏటా చెల్లించే 2.5 శాతం వడ్డీ దీనికి అదనం. అప్పట్లో డిజిటల్ లావాదేవీల్లో చెల్లింపులు చేసినవారికి అదనంగా గ్రాముపై మరో రూ.50 డిస్కౌంట్ లభిస్తుంది. ఈ లెక్కన చూస్తే అప్పట్లో పసిడి బాండ్లలో పెట్టుబడిన పెట్టినవారు 313.39% లాభాలు పొందినట్టే. సావరిన్ గోల్డ్ బాండ్ల కాలపరిమితి 8 ఏళ్లు అయినప్పటికీ, మదుపర్లు ఐదో సంవత్సరం తర్వాత నుంచి ముందస్తు ఉపసంహరణ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ బాండ్లపై ఏటా 2.5% వడ్డీ లభిస్తుంది. మెచ్యూరిటీ వరకు ఉంచుకుంటే వచ్చే లాభాలపై పన్ను మినహాయింపు ఉంటుంది. గడువు ముగియకముందే నగదు కావాలనుకునే పెట్టుబడిదారుల కోసం ప్రీమెచ్యూర్ తేదీని ఎప్పటికప్పుడు ఆర్‌బీఐ ప్రకటిస్తుంది. గ్రాము ధరను నిర్ణయించేందుకు రిడెంప్షన్ ముందు వారం చివరి మూడు రోజుల ఇండియా బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటుంది. ఆ విధంగా గ్రాము ధర రూ.15,275గా నిర్ణయించింది.






#### భాషా సమస్యకు చెక్ పెట్టేందుకు

## జెమిని 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్

ఎవరైనా కాల్ చేసినప్పుడు వారి భాష మీకు అర్థం కావట్లేదా? మీటింగ్‌లో బాస్ మాట్లాడే భాషతో ఇబ్బంది పడుతున్నారా? దీనికి చెక్ పెట్టేందుకే గూగుల్ సిద్ధమైంది. మరో సరికొత్త ఏఐ ఫీచర్‌తో ముందుకొచ్చింది. జెమినై 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్ స్పీచ్-టు-స్పీచ్ ట్రాన్సలేషన్ మోడల్‌ను తీసుకొచ్చింది (ఉవఎతినితి 3 5 ఒతిలవ ుతీజీనిబశ్రీజీబివ). అవతలి వ్యక్తి మాట్లాడే భాషను సెకన్లలోనే మనకు కావాల్సిన భాషలోకి సహజంగా ఏఐ వాయిస్ అనువాదం చేస్తుంది. దీంతో ఆఫీస్ మీటింగ్‌లు, లైవ్ బ్రాడ్‌కాస్ట్ వంటి సమయాల్లో భాషాపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి. ఐఓఎస్‌తో పాటు ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. గూగుల్ ట్రాన్స్‌లేట్, గూగుల్ మీట్, గూగుల్ ఏఐ స్టూడియో, గూగుల్ లైవ్ ఏపీఐలో రోల్‌అవుట్ చేసింది. ఏఐ వాయిస్‌లకు సింథ్ఐడీ వాటర్ మార్కింగ్ కూడా జోడించింది. ప్రస్తుతం 70కి పైగా భాషల్లో ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

## డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం

**భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం**

భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం కలిగింది. దిల్లీలో ఈ సంస్థకు చెందిన థర్డ్ పార్టీ డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం జరగడంతో నెట్‌వర్కింగ్ పరికరాలు షట్‌డౌన్ అయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో క్లౌడ్ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఈమేరకు క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ వెల్లడించింది. అయితే ఈ ప్రమాదం ఎప్పుడు జరిగిందో మాత్రం చెప్పలేదు. ప్రాణ, ఆస్తి నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఇలాంటి అంతరాయాల వల్ల కంపెనీల కార్యకలాపాలు నెమ్మదిస్తుంటాయి. దిల్లీ, చెన్నై, ముంబయితో పాటు పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ ట్రాఫిక్ ప్రభావితమైంది. పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని సంస్థ వెల్లడించింది. క్లౌడ్ ప్రొవైడర్లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూర్‌తో గూగుల్ క్లౌడ్‌కు గట్టి పోటీ నెలకొంది.

## పీవోకేలో కూలిన పాకిస్థాన్ హెలికాప్టర్

**ఘటనలో అందులోని సైనికులంతా మృతి!**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సైన్యానికి చెందిన ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో సైనికులందరూ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఘటన సమయంలో అందులో ఎంత మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. సుమారు 21 మంది పాక్ సైనికులు చనిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ముజఫరాబాద్‌లో స్థానిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడ పాక్ ఆర్మీ అదనపు బలగాలను మోహరిస్తోంది. ఇందులో భాగంగా పాక్ సైనికులతో ఉన్న హెలికాప్టర్ ముజఫరాబాద్ నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించారు. అయితే, వీరిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పాక్ ఆర్మీ ప్రకటించింది.

## ఏఐ డేటా సెంటర్.. చేతులు కలిపిన మెటా, రిలయన్స్

ప్రపంచవ్యాప్తంగా తయారయ్యే డేటాను నిల్వ చేయడం, వినియోగదారులకు చేర్చడంలో డేటా సెంటర్లు కీలకం. ఇప్పుడు ఇలాంటి డేటా సెంటర్ ఏర్పాటు కోసం రిలయన్స్ సోషల్ మీడియా దిగ్గజం మెటా చేతులు కలిపాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 168 మెగావాట్ల డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయడానికి భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రెండేళ్లలో ఇది అందుబాటులోకి రానుంది. ఈమేరకు బుధవారం రెండు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. మెటా ప్రపంచవ్యాప్త మౌలిక సదుపాయాలకు ఈ డేటా సెంటర్ సేవలందిస్తూ.. దాని వ్యాపార, ఏఐ కంప్యూటింగ్ అవసరాలనూ తీర్చనుంది. 1ఉచి పునరుత్పాదక శక్తి విషయంలో క్లీన్‌మ్యాక్స్, ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీలతో భాగస్వామ్యంపై మెటా ప్రకటన చేసింది. కాగా, మెటా, రిలయన్స్ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాయి.



2020లో జియో ప్లాట్‌ఫామ్స్‌లో మార్క్ జుకర్ బర్గ్ సంస్థ 9.99 శాతం వాటాను కొనుగోలు చేసింది. అలాగే రెండూ కలిసి 100 మిలియన్ డాలర్లతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటుచేశాయి. దేశీయ, అంతర్జాతీయ సంస్థల కోసం ఏఐ సొల్యూషన్లను అభివృద్ధి చేయనున్నాయి.
2శాతం పెరిగిన రిలయన్స్ షేర్లు..మెటాతో పార్ట్‌నర్‌షిప్‌పై ప్రకటన రాగానే రిలయన్స్ షేర్లు రెండు శాతం మేర పెరిగాయి. బుధవారం ఉదయం బీఎస్ఈలో ఈ స్టాక్ విలువ 2.39 శాతం పెరిగి రూ.1300కు చేరింది.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ బాంబుల వర్షం..

దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబిహుల్లా ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారని పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ ఘటన జరిగిన నేపథ్యంలో అఫ్గాన్‌పై వైమానిక దాడులు చేయడం గమనార్హం.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
11 జూన్ 2026



- శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక దాడి
- తనిఖీల్లో వెలుగు చూసిన భారీ అక్రమాలు
- మరికొన్ని మిల్లర్లపై తనిఖీలు కొనసాగితే బయటపడనున్న అక్రమాలు

# సీఎంఆర్ ధాన్యం స్వాహా!

## రూ. 2.5 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి

**వనపర్తి బ్యూరో జూన్ 10 జనంసాక్షి :** జిల్లాల్లో రైస్ మిల్లర్లు పక్కా ప్రణాళికతో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మిల్లర్లు ప్రతి సీజన్‌లోనూ ఇలాగే చేస్తున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం సరైన సమయంలో తనిఖీలు నిర్వహించకపోవడంతో రూ.కోట్ల విలువైన ధాన్యం దారిమళ్లుతోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం ఓ రైస్ మిల్లుపై తనిఖీలు నిర్వహించి సీఎంఆర్ కుంభకోణాన్ని వెలికితీశారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మీరాసిపల్లి (మీరాస్పల్లి) గ్రామంలోని శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో మంగళవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం, హైదరాబాద్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మిల్లు రికార్డులను, నిల్వలను పరిశీలించిన అధికారులకు భారీ షాక్ తగిలింది. మిల్లులో ఉండాల్సిన 25,426 బస్తాల సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) ధాన్యం మాయమైనట్లు, దానిని పక్కదారి పట్టించినట్లు అధికారులు పక్కాగా నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో ఈ మాయమైన ధాన్యం విలువ సుమారు రూ. 2.5 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

**25,426 బస్తాల సీఎంఆర్ ధాన్యం మాయం**

కొత్తకోట మండలం, మిరాసిపల్లి శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లుపై రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీల్లో 25,426 బస్తాల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ. 2.5కోట్ల ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**వేరే మిల్లుకు ధాన్యం అప్పగింత..**

అక్రమాలు బయటపడటంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్కడికక్కడే పంచనామా నిర్వహించారు. అనంతరం మిల్లులో మిగిలి ఉన్న మిగతా ధాన్యాన్ని భద్రతా పరిరక్షణ చర్యల్లో భాగంగా..రాయినిపేటలోని 'ఎంఎస్ ఏకేఆర్ ఇండస్ట్రీస్' యాజమాన్యానికి తక్షణమే అప్పగించారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన పూర్తి నివేదికను, సదరు మిల్లు యజమానిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వీలుగా జిల్లా అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల మేరకు సంబంధిత మిల్లర్‌పై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

**తదుపరి టార్గెట్ ఏ మిల్లో ?**

ఈ మెరుపు దాడితో వనపర్తి జిల్లాలోని రైస్ మిల్లర్లలో ఒక్కసారిగా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ఇలాగే కొనసాగితే ఏ క్షణంలో ఏ మిల్లుపై దాడులు జరుగుతాయో, ఎవరి అక్రమాలు బయటపడతాయోనని కొందరు అక్రమార్క మిల్లర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# సైబర్ టవర్స్ పరిధిలో మరోసారి హైడ్రా

**దాదాపు 3 వేల కోట్ల విలువచేసే 15ఎకరాల ప్రభుత్వ స్థలానికి విముక్తి**



**శేరిలింగంపల్లి, జూన్ 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో హైడ్రా బుధవారం మరోసారి తన పంజాను విసిరింది. ఈసారి ఏకంగా 3 వేల కోట్ల రూపాయల విలువచేసే 15 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చెరనుండి కాపాడింది. వివరాల్లోకి వెళితే... మాదాపూర్ సైబర్ టవర్స్ కు చేరువలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది దళారులు రాజకీయ ముసుగులో చెరబట్టేందుకు గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్న విషయాన్ని తెలుసుకున్న హైడ్రా బుధవారం శేరిలింగంపల్లి పై తన దాడిని కొనసాగించి ఒకటికాదు, రెండుకాదు ఏకంగా 3 వేల కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోగలిగిందంటే శేరిలింగంపల్లిలో భూకబ్జారాయుళ్లా దళారి దందా ఏ రేంజ్ లో కొనసాగుతుందో ఊహించవచ్చు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానం మెట్ రెవెన్యూ విలేజ్ పరిధి సర్వేనెంబర్ 41/12, 13, 14 లో మొత్తం 15 ఎకరాల ప్రభుత్వ భూమి నెలకొని ఉంది. అయితే సదరు భూమి తమదంటూ వెంటనే దానిని ఖాళీ చేయాలని 2016 లో టిజి ఐఐసి సంస్థ ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థకు లీగల్ నోటీసులు పంపించడం జరిగింది. కాగా వాటిని సవాలు చేస్తూ ఇట్టినా ప్రాపర్టీస్ హైకోర్టు ఆశ్రయించడం జరిగింది. హైకోర్టు జస్టిస్ బీమాపాక నగేష్ విచారణ నిర్వహించి తీర్పును వెలువరిస్తూ దశాబ్దం నాటి వివాదానికి తరలించారు. మాజీ సైనికుల కోటా కింద ప్రభుత్వం 1963 లో సదరు భూమిని కేటాయించినట్లు ఎక్కడ ఆధారాలు లేవని, ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థ సమర్పించిన పట్టాలు నకిలీవని తేలినట్లు ఆయన తన జడ్జిమెంట్ లో వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే నకిలీ పట్టాలను సాకుగా చూపి విలువైన ప్రభుత్వ భూమిని కాజేయడానికి భూకబ్జారాయుళ్లు, ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థను తెర ముందు ఉంచి నాటకమాడుతున్నారని నిర్ధారించుకొని ఆ భూములను రక్షించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ క్రమంలోనే హైడ్రా రెవెన్యూ అధికారుల విజ్ఞప్తిని ఆధారం చేసుకుని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే కాకుండా దాని చుట్టూ ఫెన్సింగ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఇది ప్రభుత్వభూమి అని పేర్కొంటూ బోర్డులను సైతం ఏర్పాటు చేయడం విశేషం.

# ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలిద్దాం

- ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- వార్డు ప్రజల శ్రేయస్సు కోసం బోరుబావులు
- మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి

**తాండూరు జూన్ 10(జనంసాక్షి) :** ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో 27 వ వార్డు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా వార్డ్ కౌన్సిలర్ స్వరూప మల్లేశం ఆధ్వర్యంలో వార్డు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ నిరజబాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ జనాభాకు సరిపడా పారిశుద్ధ సిబ్బంది లేకున్నా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యనికి పెద్ద పీఠ వేస్తున్నామని తెలిపారు. 27వ వార్డులో ప్రజలు మంచినీటి సమస్య ఉందని దృష్టికి తీసుకురావడం జరిగిందని త్వరలోనే బోరు వేస్తామని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా త్యజించి సంచులను వాడాలని అన్నారు. ప్లాస్టిక్ వల్లే అనేక రోగాలు వ్యాపిస్తున్నాయని ప్లాస్టిక్ ను నివారించాలని కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు కౌన్సిలర్ స్వరూప మల్లేశంతో కలిసి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్రెడ్డి, కానిస్టేబుల్ సాయప్ప, ఆర్ పి సుజాత మున్సిపల్ జవాన్, సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పీజీ ప్రవేశాలకు ఓయూ సిద్ధం

- అందుబాటులో ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు 11 హాస్టళ్లు
- మరమ్మతులు, పారిశుధ్య పనులు వేగవంతం చేసిన అధికారులు
- రూ.20 లక్షలతో చారిత్రాత్మక 'సి' హాస్టల్‌కు కొత్త రూపు
- డబుల్ పీజీ విద్యార్థులకు వసతి ఉండదన్న చీఫ్ వార్డెన్



**సికింద్రాబాద్, జూన్ 10 (జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మరో రెండు నెలల్లో పీజీ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల వసతి ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఆర్ట్స్, సైన్స్ విభాగాల విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించేందుకు హాస్టళ్లలో మరమ్మతులు, పారిశుధ్య పనులను వేగవంతం చేస్తున్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో మొత్తం 11 హాస్టళ్లు ఉండగా, వీటిలో బాలికల కోసం ఆరు, బాలుర కోసం ఐదు హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. విశ్వవిద్యాలయ పరిధిలో ని దుందుభి హాస్టల్‌లో 750 మంది, న్యూ గోదావరిలో 350 మంది, మంజీరలో 200 మంది, మానేరు హాస్టల్‌లో 200 మంది, బీఈడీ హాస్టల్‌లో 200 మంది, సెంటినరీ హాస్టల్‌లో 750 మంది, బ్లాక్-1లో 450 మంది, బ్లాక్-3లో 700 మంది, నిజాం బ్లాక్‌లో 250 మంది, పీహెచ్‌డీ బ్లాక్‌లో 70 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. చాలా కాలంగా నిరుపయోగంగా మారిన చారిత్రాత్మక 'సి' హాస్టల్‌ను ప్రత్యేక నిధులతో పునరుద్ధరించారు. రూ.20 లక్షల వ్యయంతో మరమ్మతులు పూర్తి చేసి సరికొత్త రూపును తీసుకొచ్చారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బీఈడీ, ఎంఈడీ, న్యాయశాస్త్ర విద్యార్థుల కోసం ఈ భవనాన్ని మెస్‌గా వినియోగించనున్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణ కోసం సుమారు 400 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీరితో పాటు పారిశుధ్య సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. బాలికల హాస్టళ్లలో 100 మంది, బాలుర హాస్టళ్లలో 90 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. పరిశుభ్రత చర్యల కోసం సుమారు రూ.1 లక్ష విలువైన శానిటైజేషన్ సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. డబుల్ పీజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించే అవకాశం లేదని ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. ముందుగా సింగిల్ పీజీ విద్యార్థుల ప్రవేశాలు పూర్తి చేసి, అనంతరం స్కాలర్‌షిప్‌కు అర్హులైన వారికి వసతి కల్పిస్తామని తెలిపారు. ఆ తర్వాత మిగిలిన సీట్ల లభ్యతను బట్టి ఇతర విద్యార్థులకు కేటాయింపులు చేపడతామని వెల్లడించారు.

# రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- అర్రైవ్ అలైవ్ కార్యక్రమంపై అవగాహన, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి
- హెల్మెట్ల పంపిణీ,రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలకు సూచన




**భిక్కనూరు జూన్ 10 (జనం సాక్షి):** భిక్కనూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు,గ్రామసభలో ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు సంక్షేమపథకాల అమలు తీరును గ్రామస్తులతో కలిసి సమీక్షించారు,గ్రామప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,ప్రత్యేక గ్రామసభల ద్వారా గ్రామఅభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు,గ్రామంలో నిరుపేదలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ గృహనిర్మాణం మంజూరు చేయాలని సూచించారు, ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ 18 సంవత్సరాల నిండిన అరులైన వారిని ఓటర్ జాబితాలో నమోదు చేయడం,డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు, రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించి పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు,ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు,"అర్రైవ్ అలైవ్"కార్యక్రమం నిర్వహించి రహదారి భద్రతపై జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,రోడ్డు భద్రత నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు,అనంతరం అన్ని గ్రామాలలోనీ పారిశుద్ధ కార్మికులకు, కెజెఎల్ సహకారంతో హెల్మెట్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.వి,గిరి, డిపిఓ మురళి, డిఎల్‌పిఓ శ్రీనివాస్, డి.ఈ.ఓ మల్లికార్జున్, డివిజనల్ విద్యుత్ అధికారి, తాసిల్దార్ సునీత, ఎంపీడీఓ రాజ్ కిరణ్ రెడ్డి, ఎంఈఓ రాజ గంగారెడ్డి,సి.ఐ జగడం నరేష్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది,పంచాయతీ ఈఓ మహేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, వార్డుసభ్యులు కర్రోళ్ల రాజు, సురేష్ గౌడ్,గజే వేణు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టీజీఎస్ ఆర్టీసీ ఇడి (ఐటీ)గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజశేఖర్

- ప్రయాణికులకు డిజిటల్ సేవలు విస్తరిస్తాం : ఈడీ ఎం. రాజశేఖర్
- ఎండీ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఈడీ

**ముషీరాబాద్, జూన్ 10 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ,పి, ఎ.ఎం, లీగల్)గా సీనియర్ అధికారి ఎం. రాజశేఖర్ బుధవారం హైదరాబాద్‌లోని బస్ భవన్ లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది నూతన ఈడీకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ ఐటి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణికులకు టికెట్ బుకింగ్, లైవ్ బస్ ట్రాకింగ్ వంటి డిజిటల్ సేవలను మరింత సులభతరంగా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఐటి విభాగంతో పాటు పర్సనల్, అస్సెట్ మేనేజ్‌మెంట్, లీగల్ విభాగాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సంస్థ ఆదాయ వనరులను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అంతర్గత పరిపాలనను వేగవంతం చేస్తామని, అలాగే సంస్థకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను సకాలంలో పరిష్కరించి ఆర్టీసీ ప్రయోజనాలను కాపాడుతామని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం, అధికారులు, కార్మికులను సమన్వయం చేసుకుంటూ టీజీఎస్ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సామూహికంగా కృషి చేస్తామని ఈడీ రాజశేఖర్ తెలిపారు.



# గుండ్ల చెరువు మత్తడి తగ్గించాలి

**జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వినతి**

**హుజురాబాద్, జూన్ 10 (జనం సాక్షి) :** హుజురాబాద్ పట్టణంలోని గుండ్ల చెరువు మత్తడి ఎత్తుగా ఉండటంతో ప్రతి వర్షాకాలంలో బ్యాక్ వాటర్ కారణంగా పట్టణంలోని పలు కాలనీలు నీట మునుగుతున్నాయని, అలాగే చెరువు వెనుక భాగంలో ఉన్న రైతుల వ్యవసాయ భూములు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గుండ్ల చెరువు మత్తడిని తగ్గించాలి నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతులు, స్థానిక ప్రజలు దీ=ూ నాయకులతో కలిసి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, గుండ్ల చెరువు మత్తడి ఎత్తుగా ఉండటం వల్ల ప్రతి ఏడాది వర్షాకాలంలో హుజురాబాద్ పట్టణంలోని పోచమ్మవాడతో పాటు పలు కాలనీలు జలమయం అవుతున్నాయని, వందల రైతుల పంట భూములు నీట మునిగి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి గుండ్ల చెరువు మత్తడిని తగ్గించాలి అని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, రైతులు మరియు పట్టణ ప్రజలకు న్యాయం జరిగే వరకు ఈ అంశంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# వాగులను కబలించే కబ్జా కోరులను వదిలిపెట్టం

- కాల్వలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు
- తోల్కట్ట గుండ్లవాగులో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- మొయినాబాద్ తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్




**మొయినాబాద్, జూన్10, జనంసాక్షి:** తోల్కట్ట గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 159,162,163,175 మరియు 177 లో నుండి ప్రవహించే గుండ్లవాగులో సర్వే నెం 162 లో కొందరు వ్యక్తులు మట్టిపూడ్చి పెద్ద ఎత్తున కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న విషయంలో తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఈ రోజు అట్టి భూమిని మండల సర్వేయర్ మరియు ఇరిగేషన్ అధికారులతో సర్వే నిర్వహించారు. అనంతరం వాగులో నిర్మించిన సుమారు 300 మీటర్ల అక్రమ రాతి కట్టడాన్ని (కాంపౌండ్ వాల్ )ను రెండు జేసీబీల సహాయంతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కె.గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ఇట్టి వాగు కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, రియల్ ఎస్టేట్ పేరుతో 111 జీవో పరిధిలో మండలంలో చెరువులు, వాగులు, కాల్వల జోలికిస్తే జైలుకు పంపుతామని భూకబ్జారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మండల సర్వేయర్ జలజ, ఇరిగేషన్ ఏఈలుశివకుమార్, వరప్రసాద్, తోల్కట్ట జీపీఓ గణేష్ తోపాటు రెవెన్యూ సిబ్బంది జీపీఓలు జానకిరామ్,రవి, నర్సింహా, అజీజ్, రామకృష్ణ,రాజు,అమర్, తదితరులు పాల్గొన్నారు.

# భార్యను రివాల్వర్‌తో కాల్చిచంపిన భర్త



**మల్కాజిగిరి జూన్ 10(జనంసాక్షి) :** కుటుంబ కలహాలు, అనుమానంతో ఓ వ్యక్తి తన రెండో భార్యను పిస్టల్‌తో కాల్చి దారుణంగా హత్య చేసిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు మరియు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మారుతీనగర్‌కు చెందిన దామర అరుణ్ కుమార్ (49) స్వర్ణలతతో 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. స్వర్ణలతకు తెలియకుండా ఆమె చెల్లెలు నిషారాణిని యాదగిరిగుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి మొదటి భార్య స్వర్ణలత తన పుట్టింటికి వెళ్లిపోయింది. కొంతకాలం కాపురం సజావుగానే సాగినప్పటికీ, ఆ తర్వాత నిషారాణిపై అరుణ్ కుమార్ అనుమానం పెంచుకున్నాడు. ఆమెను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు. భర్త వేధింపులు తట్టుకోలేక నిషారాణి మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తన బాబాయ్ ఎద్దు మల్లేష్ ఇంటికి వెళ్ళిపోయింది. పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగి, ఇకపై బాగా చూసుకుంటానని అరుణ్ కుమార్ ఒప్పుకోవడంతో ఆమె తిరిగి వచ్చింది. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు.

ఈ ఏడాది మార్చి నెలలో అరుణ్ కుమార్ అక్రమంగా ఒక పిస్టల్ కొనుగోలు చేయడంతో, విశ్వాసనీయ సమాచారం మేరకు అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదై జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో నిషారాణి మళ్లీ రక్షణ కోసం నర్సాపూర్‌లోని బాబాయ్ ఇంటికి వెళ్లింది. జైలు నుండి విడుదలైన తర్వాత అరుణ్ కుమార్ నర్సాపూర్ వెళ్లి భార్యను మళ్లీ ఇంటికి తీసుకువచ్చాడు. గత ఐదు రోజులుగా వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున అరుణ్ కుమార్ తన వద్ద ఉన్న పిస్టల్‌తో నిషారాణి తలపై కాల్పులు జరిగి పారిపోయాడు. బుల్లెట్ గాయాలతో ఆమె అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలి సోదరుడైన గడ్డం సంతోష్ యాదవ్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని తన సోదరి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. గడ్డం సంతోష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని సి ఐ సత్యనారాయణ తెలిపారు.

# మట్టి తవ్వకాలను అడ్డుకున్న జిపిఓపై దాడికి యత్నం


- ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ రెచ్చిపోయిన మట్టి మాఫియా
- ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించి దూషించిన 11 మందిపై పోలీసులకు ఫిర్యాదు



**మర్పల్లి జూన్ 10 (జనంసాక్షి) :** మండలంలో రోజురోజుకు మట్టి మాఫియా ఆగడాలు మితిమీరి పోతున్నాయి. మాకు ఎవరూ ఏమీ చేయలేరని ధీమాతో మట్టి మాఫియా ఉన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వేస్తూ అక్రమ మట్టి దందాకు తెరలేపిన కొందరు వ్యక్తులను ప్రభుత్వ అధికారి పైననే తిరగబడ్డ సంఘటన సంచలనం రేపింది. విధినిర్వహణలో ఉన్న తుమ్మలపల్లి గ్రామ జిపిఓ బాలరాజు అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని చెప్పడంతో రెచ్చిపోయిన వ్యక్తులు దుర్భాషలాడుతూ దాడికి యత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జరిగిన సంఘటనను రెవెన్యూ శాఖ అధికారులు తుమ్మలపల్లి గ్రామానికి చెందిన 11 మందిపై మర్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తుమ్మలపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గుర్తించిన జిపిఓ బాలరాజు వాటిని అడ్డుకునేందుకు వెళ్లాడు. నువ్వు ఎవరికైనా చెప్పుకో ఎవరు ఏం చేయలేరంటూ బెదిరింపులకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతే కాకుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని అవమానించారు వ్యాఖ్యలు చేస్తూ భౌతిక దాడికి ప్రయత్నించినట్లు ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులపై ద్రౌజన్యాలకు పాడుపడితే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# యూపీఐ లంచాల గుట్టురట్టు

**ఏసీబీకి చిక్కిన సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్**



**కరీంనగర్ టౌన్/ బ్యూరో, జూన్ 10, (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బిల్లుల క్లియరెన్స్ పేరుతో కాంట్రాక్టర్ల నుంచి యూపీఐ ద్వారా లంచాలు వసూలు చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రాధికను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం అరెస్టు చేశారు. ఐసీడీఎస్‌కు కోడిగుడ్లు, పప్పులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి రూ.2.37 లక్షలకు పైగా అక్రమంగా వసూలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బిల్లులను త్వరగా క్లియర్ చేయడం, పెండింగ్ ఫైళ్లను ముందుకు కదిలించడం కోసం రాధిక డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగదు రూపంలో కాకుండా యూపీఐ లావాదేవీల ద్వారా డబ్బులు స్వీకరించినట్లు, కొన్ని చెల్లింపులు బినామీ ఖాతాల ద్వారా జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కాంట్రాక్టర్ల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ ప్రారంభించిన ఏసీబీ అధికారులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు. అనంతరం రాధికను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మరెవరైనా అధికారులు లేదా మధ్యవర్తుల ప్రమేయం ఉందా, గతంలో కూడా ఇదే తరహాలో అక్రమ వసూళ్లు జరిగాయా అనే కోణాల్లో ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ పూర్తయ్యాక వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటన జిల్లా అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# 433 మంది డాక్టర్ల నియామకం

**నియామక పత్రాలను అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను తీర్చడంతోపాటు వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల లిస్టును బుధవారం బోర్డు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలలోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇందులో ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూన్ 10 (జనంసాక్షి) :** పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మ లని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుం దని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతం తోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

# సుస్థిర మైనింగ్‌లో సింగరేణి మరో మైలురాయి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బొగ్గు గనుల నిర్వహణలో మాత్రమే కాకుండా, గనుల మూసివేత అనంతరం పర్యావరణ పరిరక్షణలోనూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్న సంస్థగా సింగరేణి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని డోర్లీ-2 ఓపెన్కాస్ట్ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా విజయవంతంగా మూసివేసినందుకు గుర్తింపుగా, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన సుమారు రూ.40 కోట్ల సొమ్మును వడ్డీతో సహా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) సింగరేణికి తిరిగి చెల్లించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు దిశానిర్దేశంలో సింగరేణి సంస్థలో తీసుకుంటున్న పర్యావరణహిత చర్యలకు లభించిన గుర్తింపుగా భావించవచ్చు.

గనుల ప్రారంభం నుంచి మూసివేత వరకు అమలు చేయాల్సిన మైన్ క్లోజర్ ప్లాన్, పర్యావరణ పరిరక్షణ చర్యలు, భూ సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలు తదితర అంశాలను సింగరేణి సంస్థ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన నిధులను ఇటీవల వడ్డీతో సహా తిరిగి విడుదల చేసింది. డోర్లీ-2 గని మూసివేత ప్రక్రియలో సింగరేణి చూపిన బాధ్యతాయుత వైఖరి, పర్యావరణ హిత చర్యలు, పారదర్శకత, ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన తీరుకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గనుల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సుస్థిర మైనింగ్ విధానాలను అమలు చేస్తున్న సింగరేణి సంస్థకు ఇది మరో విశిష్ట గుర్తింపుగా భావిస్తున్నారు.

అప్పటికే సింగరేణి సంస్థ దశల వారీగా ఒప్పందంలోని అంశాలను అమలు జరుపుతూ వచ్చింది. ఈ పనులు ఇచ్చిన హామీ ప్రకారం పూర్తి అయినాయా ? లేదా ? అనే అంశాన్ని ఒక థర్డ్ పార్టీ ఏజెన్సీ అయిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శిబ్ పూర్ (పశ్చిమ బెంగాల్) ద్వారా జులై, 2024లో నిర్వహించారు. ఆడిట్లో అన్ని సక్రమంగా జరిగాయని సింగరేణి సంస్థ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు జరిపిందని పేర్కొన్నారు. ఫలితంగా ఏడేళ్ల క్రితం డిపాజిట్ చేసిన సొమ్మును వడ్డీతో సహా కలిపి తిరిగి సింగరేణి సంస్థకు చెల్లిస్తున్నట్లు డిప్యూటీ అసిస్టెంట్ కోల్ కంట్రోలర్ ఆకాష్ శివ హరే తమ లేఖలో ఇటీవల పేర్కొన్నారు. మొత్తం 40 కోట్లు చెల్లించాల్సి ఉండగా దీనిలో 90% డిపాజిట్ సొమ్ము 36.63 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామని, మిగిలిన పది శాతం జస్ట్ ట్రాన్సిషన్ ప్రొవిజన్స్ అంశాలు పరిశీలించిన తర్వాత చెల్లిస్తామని పేర్కొన్నారు. అంటే దాదాపు 40 కోట్ల రూపాయలు తిరిగి సింగరేణి సంస్థ ఖాతాలో పడుతున్నాయి. దీనిపై సింగరేణి యాజమాన్యం తన సంతృప్తిని వ్యక్తం చేసింది.

దీనిపై డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ చిత్తశుద్ధితో చేపడుతున్న గని మూసివేత చర్యలకు నిదర్శనంగా కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారు డిపాజిట్ సొమ్మును తిరిగి కంపెనీకి చెల్లించారని, గతంలో ఒక భూగర్భ గనికి (ఆర్కే-8 ఇంక్లైన్, శ్రీరాంపూర్) సంబంధించి రూ.4 కోట్ల డిపాజిట్ ను తిరిగి ఇదే విధంగా చెల్లించారని పేర్కొన్నారు. మూసివేత దశలో ఉన్న మరికొన్ని గనుల్లోనూ ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు పటిష్ట పర్యావరణ హిత చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. త్వరలో మరికొన్ని మూతబడిన గనులకు సంబంధించిన పనులు పూర్తి చేసి ఉన్నందున వాటి డిపాజిట్లు సింగరేణికి అందనున్నాయని పేర్కొన్నారు. డోర్లీ-1 గనికి సంబంధించి కూడా తనిఖీలు చివరి దశలో ఉన్న నేపథ్యంలో దానికి సంబంధించి మరో రూ.60 కోట్లకు పైగా డిపాజిట్లు తిరిగి వచ్చే అవకాశం ఉందన్నారు.

## స్థిరాస్థి వ్యాపారి అరుణ్ కుమార్ దురాగతం

- భార్యపై అనుమానంతో కాల్పులు
- అక్కడిక్కడే మృతి చెందిన ఇల్లాలు

**హైదరాబాద్, జూన్ 10 (జనంసాక్షి) :** ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

# రాష్ట్రపతి నిలయం అందాలకు ముగ్ధులైన గవర్నర్ దంపతులు



**హైదరాబాద్, జూన్ 10 (జనంసాక్షి) :** చరిత్ర, సంస్కృతి, ప్రకృతి సోయగాల సమ్మేళనంగా నిలిచిన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా బుధవారం సాయంత్రం సందర్శించారు. తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. విశాలమైన పచ్చిక బయళ్లు, అపురూపమైన ఉద్యానవనాలు, కళాత్మక నిర్మాణాలు, చారిత్రక విశేషాలతో కూడిన ప్రదేశాలను తిలకించిన గవర్నర్ దంపతులు రాష్ట్రపతి నిలయం అందాలకు ముగ్ధులయ్యారు. సందర్శన సందర్భంగా ప్రధాన భవనంలోని ప్రెసిడెంట్ వింగ్, హెర్బల్ గార్డెన్, చారిత్రాత్మక జెండా స్తంభం ప్రతిరూపం, జై హింద్ స్టెప్ వెల్, చెరియల్ ఆర్ట్ టన్నెల్, మ్యూజికల్ ఫౌంటెన్, నక్షత్ర గార్డెన్, రాక్ గార్డెన్, మేజ్ గార్డెన్‌లను వారు ఆసక్తిగా పరిశీలించారు. అలాగే రాతి శిలలపై చెక్కిన కళాఖండాలు, మహనీయుల జీవిత విశేషాలను ప్రతిబింబించే ఆర్ట్ గ్యాలరీ, ప్రకృతి ఒడిలో విరాజిల్లుతున్న వివిధ నిర్మాణాలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రపతి నిలయం మేనేజర్ కె. రజనీ ప్రియ గవర్నర్ దంపతులకు వివిధ ప్రదేశాలను చూపిస్తూ వాటి చారిత్రక, సాంస్కృతిక, పర్యావరణ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి విభాగాన్ని ఆసక్తిగా పరిశీలించిన గవర్నర్ దంపతులు రాష్ట్రపతి నిలయం నిర్వహణ, అభివృద్ధి, పరిరక్షణ చర్యలను అభినందిం చారు. సందర్శనలో గవర్నర్ వెంట గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి కె.శశికిరణాచారి ఉన్నారు.

# కోలివింగ్ హాస్టళ్లపై విచారణ చేయాలి

- ప్రభుత్వానికి విహెచ్ డిమాండ్



**హైదరాబాద్, జూన్ 10 (జనంసాక్షి) :** ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు కలిసి ఉండే 'కో లివింగ్ హాస్టల్స్' సంస్కృతిపై సర్వత్రా చర్చ నడుస్తున్న వేళ.. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హాస్టల్స్ నిర్వహణ తీరు, అక్కడ అసలు ఏం జరుగుతోంది, యువత ఏ విధంగా ప్రభావితమవుతోంది అనే అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం నడుస్తున్న కో-లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడ చోటుచేసుకుంటున్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. అలా చేసిన తర్వాతే వాటిని పూర్తిగా రద్దు చేయాలా? లేక కఠినమైన నిబంధనలను అమలు చేయాలా? అన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఇలాంటి హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే సమాజంలో, మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కో-లివింగ్ హాస్టల్స్‌లో అమ్మాయిల తప్పా? లేక అబ్బాయిల తప్పా? తెలుసుకోవాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి' అని అన్నారు.

# జన సేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

- అక్కడికి రావద్దంటే.. మీ జాగీరా అనడంలో తప్పేముంది
- ఉత్తర,దక్షిణాది విభేదాలు దేశానికి ప్రమాదకరం
- మీడియాతో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ, జూన్ 10 (జనంసాక్షి) :** జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావిం చారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పని చేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు.

## ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ)గా ఎం.రాజశేఖర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ, పీఏఎం అండ్ లీగల్)గా సీనియర్ అధికారి ఎం. రాజశేఖర్ బుధవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సంస్థ ఎండీ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఈడీకి సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తుమ్మిడిహెట్టి విషయంలో డ్రామాలు బంద్ చేయాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తుమ్మిడిహెట్టి విషయంలో కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు బంద్ చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు తాను అడ్డుపడితే రాజీనామా చేస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సీఎంకు లెటర్ రాయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అంటున్నారని.. సీఎం మాత్రం కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని అంటున్నారని పేర్కొన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది మాజీ సీఎం వైఎస్ఆర్ అని.. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. నాటి మహారాష్ట్ర కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి లెటర్ రాసి 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టికి అనుమతి ఇచ్చేది లేదని చెప్పారని తెలిపారు. ఆ సమయంలో కేంద్రంలో, మహారాష్ట్రలో, ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయని అయినా సాధ్యపడలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎవరిని మోసం చేద్దామని ఇలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సైతం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఎంత బతిమిలాడినా ఒప్పుకోలేదన్నారు. ముంబైలో ఐదు రోజులు ఉండి ప్రాజెక్టు కోసం ప్రయత్నం చేశామన్నారు.

# మణ్నాళ్ల ముచ్చటగా బీఆర్‌ఎస్ ప్రాజెక్టులు

- కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయింది
- కాంగ్రెస్ హయంలో అన్ని ప్రాజెక్టులు శాశ్వతంగా నిలిచిపోయాయి
- మేడిగడ్డ, సుందిళ్ల పరిస్థితి ఏమైందో అందరూ గమనించాలి
- నిజామాబాద్ పర్యటనలో జాకోరా, చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్
- సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు కేటాయింపు



**మహదేవ్‌పూర్(జనంసాక్షి):** కాంగ్రెస్ పాలనలో నిర్మించిన అన్ని ప్రాజెక్టులు గట్టిగా నిలబడ్డాయని, బీఆరఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల పరిస్థితి ఏమైందో అందరూ గమనించాలన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన.. జాకోరా, చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సవరించిన అంచనాల మేరకు సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు మంజూరు చేస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. కాలువలను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పరిస్థితిపై సవిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ మార్పుతోనే పెద్ద తప్పు జరిగిందన్నారు. ప్రపంచ స్థాయి నిపుణులు, సంస్థల సహకారంతో 2027 జులై వరకు పునరుద్ధారణ పూర్తి చేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఒక చుక్క నీరు వినియోగం చేయకుండా రికార్డు స్థాయిలో 2.95 లక్షల మెట్రిక్ టన్నులు ధ్యానం కొనుగోలు చేపట్టామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370